## శ్రీరాముడు

*(అయోధ్యా చక్రవర్తియైన దశరథునకు మువ్వురు భార్యలు. మొదటి భార్యయైన కౌసల్యాదేవి కుమారుడే శ్రీరామచంద్రుడు. రెండవ భార్యయైన సుమిత్ర కుమారులే లక్ష్మణ, శతృఘ్నులు. మూడవ భార్యయైన కైక కుమారుడే భరతుడు. శ్రీరామచంద్రుడు పితృవాక్య పరిపాలకుడు. అతి బాల్యమునందే సర్వశాస్త్రములు నేర్చెను. అరువది నాలుగు విద్యలు అతని హస్తమున, చిత్తమున నిలచెను. విశ్వామిత్ర మహర్షి కోరగా యజ్ఞ సంరక్షణకై వెనుతీయక రాక్షసులతో యుద్ధము సల్పి తాటకి అను రాక్షస కుటుంబమును రూపుమాపెను. మహర్షుల మన్ననలను పొందెను. మానవులకు అసాధ్యమైన భారముగల శివధనస్సును జనకుని భవనమందుండ దానిని యెత్తువారలకు తన పుత్రియైన సీతనిత్తునని చాటుటచే విశ్వామిత్రుని ఆజ్ఞననుసరించి లక్ష్మణ సమేతుడై రాముడు మిథిలాపురము చేరి దేశము మెచ్చ శివధనస్సును అవలీలగా త్రుంచి కీర్తిని గాంచెను. భర్త శాపముచే రాయిగా మారిన అహల్యను నాతిగా చేసి దైవశక్తిని నిరూపించెను. తండ్రి మాటను దక్కించుటకై పినతల్లి కోరినటుల తన తమ్ముడైన భరతునికే రాజ్యమునిమ్మని తాను సీతాలక్ష్మణ సమేతుడై పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము గావించెను. అడవులయందు తపస్సాచరించు మునులకు, ప్రజలకూ అనేక యిక్కట్లు కలిగించుచున్న రాక్షసులను హతమార్చి ఆశ్రమములను, ప్రజలను కాపాడెను. రాక్షస రాజైన రావణుడు లంకను ముఖ్యపట్టణముగా యేర్పరచుకొని ప్రధాన బలశాలులను తన అంగరక్షకులుగా చేసుకొని అనేక దురాచారములు గావించుచుండెను. అతడు ఒకనాడు సీత విషయము విని ఆమెను అపహరించెను. ఆమెను గొనిపోయి లంకలో అశోకవనమునందుంచుకొనెను. రాములు సీతాన్వేషణ సలుపుచూ సుగ్రీవుని, హనుమంతుని మార్గమధ్యమున స్నేహము చేసుకొని వాలిని కూలగొట్టి, సుగ్రీవునకు రాజ్యము కట్టి వారలచే సీతాన్వేషణ గావించి లంకను భస్మమొనరించి రాక్షసులను సంహరించి సీతను గాంచి తన పాదభక్తుడైన రావణుని సోదరుడైన విభీషణుని లంకా రాజ్యాధిపతి గావించి సీతతో అయోధ్య చేరెను.*

*ధర్మమును, ధరణిని, ధర్మపత్నిని రక్షించుకొనుటే పురుషధర్మమని బోధించి ప్రజాక్షేమమే తన కర్తవ్యమని గుర్తించి, సర్వజనరంజకముగా ప్రజాపరిపాలన జరిపి, ధర్మమును బోధించి తానే దైవమని నిరూపించిన దివ్యమూర్తి శ్రీరామమూర్తి. అతని ఆరాధనే భారతీయుల నిత్యపారాయణము. అతడు మానవాకారమును ధరించి, ధర్మసంస్థాపనకై ధర్మమూర్తిగా అవతరించిన శ్రీమన్నారాయణుడు. అతను సర్వజ్ఞుడు, సర్వశక్తి సంపన్నుడు, సర్వవ్యాపకుడు, అతడే అందరియందు ఆత్మారాముడై వేలాది వేల బల్బులలోని కరెంటువలె అందరి హృదయములలో ఆత్మరూపుడై ప్రకాశించుచున్నాడు. అతని ఆదర్శములే మన నిత్యాచారములు కావలెను. రామరాజ్యమున దురాచారములకు చోటులేక ఒకరికొకరు సోదరులవలె ప్రజలు మెలగెడివారు.)*

చక్కెరకంటె తీపి దధిసారముకంటెను రుచ్యమౌను పెం
పెక్కిన తేనెకన్న అతి తృప్తినిడున్, మరి పల్కపల్కగా
మిక్కిలి కమ్మనౌ అమృతమేయనిపించును, కాన, నిత్యమున్
చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్.

'రామ' అనే పదమునకు అర్థము గుర్తించాలి. అసలు మానవ జన్మమునకు మూల కారణమేమిటి? చేసిన పాపములు, అనుభవించిన తాపము, అజ్ఞానము ఈ మూడే కారణములు. అదే 'ర, అ, మ' ఈ మూడూ చేరినప్పుడే 'రామ' అయింది. 'ర' అనగా అగ్నిబీజము. 'అ' చంద్రబీజము. 'మ' సూర్యబీజము. అగ్నిబీజము యేమిచేస్తుంది? సమస్తము భస్మము చేస్తుంది. కనుక, మానవుడు చేసిన పాపములను భస్మము చేసేటువంటిది 'ర' కారము. సూర్యబీజము అజ్ఞానమనే అంధకారాన్ని నిర్మూలము గావించి ప్రకాశవంతమైన వెలుగును అందిస్తుంది. చంద్రబీజము లోన వున్నటువంటి తాపమును చల్లార్చి, శాంతిని చేకూరుస్తుంది. ఈనాటి మానవునకు పాపమును నిర్మూలము గావించటము, అజ్ఞానమును దూరంగావించటము, హృదయమును చల్లపరచటం కావాలి. 'రామ' అనే నామము మన పాపమును, తాపమును, అజ్ఞానమును కూడా ఒక్కతూరే పరిహారము చేస్తుంది.

**రామతత్త్వము**

'రమ్' అనే ధాతువునుండి పుట్టినది రామ శబ్దము. 'ఇ' అనే ధాతువునుండి పుట్టినది అయన శబ్దం. రామ అనగా రమించటం, ఆనందించటం, ఆనందింపచేయటం, ఆహ్లాదము కలుగజేయటం. చలనం, గమనం, స్పందనం ఈ మూడింటి తత్త్వమే అయనం. 'ర' అనగా ఆత్మ, 'మ' అనగా మనస్సు. మనస్సును ఆత్మలో చేర్చటమే రామతత్త్వము. ఆనందతత్త్వమును ప్రపంచ వ్యాప్తము గావించటమే రామఅయనం. ఆనందమును అనుభవించి, పెంచి, పంచటమే రామతత్త్వము. సర్వవ్యాపకము గావించునది అయనము. ఆహ్లాదమును సర్వవ్యాప్తి గావించటమే రామతత్త్వము.

***రామనామ విశిష్టత***

'నమఃశివాయ' అనే పంచాక్షరీ మంత్రంలో మకారం ప్రాణం. మకారం లేకపోతే అది 'నశివాయ' అవుతుంది. అనగా శివుడు కాదని అర్థం. కనుక, అందులో మకారం ఉండే తీరాలి. ఇంక, 'ఓంనమోనారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్రంలో రకారమే ప్రాణం. రకారం తీసివేస్తే అది 'నాయనాయ' అవుతుంది. అనగా నిర్జీవమైపోతుంది. కనుక, ఇందులో రకారం చాలా ప్రధానం. ఈ రెండింటియొక్క చేరిక 'రామ' అనే నామము. కనుక, ఇది ప్రాణ స్వరూపమైనది.

'రామ్' అనే పదములోపల 'రా' అనగా మనో ద్వారము తెరుస్తూ ఉంటుంది. ఈ 'రా' అనే ద్వారమునుండి మనము చేసేటువంటి పాపములన్నీ బయటపడి పోతున్నాయి. అంతేకాదు, బయటకుపోయిన యీ పాపములు తిరిగి లోపలికి ప్రవేశించకుండా 'మ్' ద్వారము మూసుకు పోతుంది. కొండలవంటి పాపములు కూడా ఒక్కతూరి రామనామముతో భస్మమైపోతాయి. రామనామమునకుండిన మాధుర్యము, రామనామమునకుండిన దివ్యత్వము అర్థము చేసుకొని వర్తించాలి.

ఒకానొక సమయంలో రాముని తల్లి, హనుమంతుని తల్లి, అగస్త్యుని తల్లి ముగ్గురూ ఒక చోట చేరినారట. 'ముగురాడవారు చేరిన సుగుణాకర పట్టపగలు చుక్కలు రాలున్' అన్నట్లుగా ఈ ముగ్గురూ ఊరకే కూర్చోలేదు. కౌసల్య, 'అమ్మా! నీ వెవరు?' అని అడిగింది హనుమంతుని తల్లిని. అప్పుడామె, 'అమ్మా! నా గురించి నీకు తెలియదా? సీతాన్వేషణ నిమిత్తమై లంక చేరటానికి పెద్ద సముద్రాన్ని అతి సులభంగా దాటిన హనుమంతుని తల్లిని నేను' అన్నది. ఈమాట విన్న అగస్త్యుని తల్లి, 'నీ కుమారుడు చేసిన పని గొప్పదేమీ కాదు. నా కుమారుడు సముద్రాన్నే మింగివేశాడు' అన్నది. అప్పుడు కౌసల్య, 'ఎవరి మహిమవల్ల హనుమంతుడు సముద్రాన్ని దాటగల్గాడో, ఎవరి శక్తి వల్ల అగస్త్యుడు సముద్రాన్ని మ్రింగగల్గాడో అట్టి శ్రీరామచంద్రుని తల్లిని నేను' అన్నది. ఇంతలో రాముడు అక్కడికి వచ్చాడు. 'ఏమిటమ్మా! నా గురించి ఏదో మాట్లాడుకుంటునట్లున్నారు' అని అమాయకుని వలె ప్రశ్నించాడు. తాను సాక్షాత్ నారాయణుడైనప్పటికీ అమాయకుని వలె, సామాన్య మానవుని వలె ప్రవర్తించాడు. అప్పుడా ముగ్గుర తల్లుల మధ్య జరిగిన సంభాషణను తెలుసుకొని, ' అమ్మా! హనుమంతుడు సముద్రాన్ని దాటగల్గాడంటే, అగస్త్యుడు సముద్రాన్ని మ్రింగగల్గాడంటే దానికి వారి భక్తిప్రపత్తులే మూలకారణం. ఇందులో నా గొప్పతనమేమీ లేదు. నా ఈ దేహానికి పెట్టిన నామమే సర్వశక్తి స్వరూపం. వారి హృదయ పవిత్రత కూడా దీనికి మూల కారణం. ఎంతమంది నా నామాన్ని ఉచ్చరించంటం లేదు? కానీ అందరూ ఇట్టి ఘనకార్యాలు సాధిస్తున్నారా? కాబట్టి కేవలం నామాన్ని స్మరిస్తే ప్రయోజనం లేదు. హృదయ పవిత్రత కూడా ఉండాలి ' అన్నాడు.

రావణుని ఘోరమైన హింసలు అధికమౌతూ వచ్చాయి. ఆ బాధలు తట్టుకోలేక దేవతలు, మునులు, కింపురుషులు వీరందరూ బ్రహ్మ వద్దకు వెళ్లి ప్రార్థించారు. బ్రహ్మ గతంలో రావణునికి యిచ్చిన వరాల గురించి హెచ్చరించగా, బ్రహ్మ, 'అమాయకులారా! నేను అంత తెలివితక్కువ వాడను కాను. రావణాసురుడు అడగటం, నేను అనుగ్రహించటం నిజమే! ఆనాటినుండి రావణుడు మానవులంటే చిన్న పురుగులవలె భావించేవాడు కనుక, సురలవలనగాని, అసురులవలనగాని, కిన్నరకింపురుషుల వలనగాని మరణం రాకుండా ఉండాలని కోరుకున్నాడు. కాని, మానవుని వలన మరణం రాకూడదని ఆశించలేదు. కనుక, నేను ఏవిధంగా అతను సంహరింపబడాలో తగిన కృషి చేస్తాను' అన్నాడు. 'స్వామీ! మీరు భగవంతుడు కదా! మానవుల స్వరూపాన్ని మీరు యేవిధంగా ధరించగలరు?' 'దైవం మానుష రూపేణ, మనుష్యరూపము ధరించి అయోధ్యలో ఉద్భవించి, ఆ రాక్షసుని సంహరించటానికి తగిన కృషి చేస్తాను' అన్నాడు. ఎవరివలననూ రావణుడు మరణించటానికి అవకాశం లేదు. ఒక్క మానవుని చేతనే రావణుని మరణం నిర్ణయించబడింది.

***ధనధాన్యాదులకంటె, స్వర్గముకంటె దైవమే కోరదగినది***

శరభంగుడొక మహర్షి. ఆయన చేసిన తీవ్ర తపస్సుకు మెచ్చి, ఇంద్రుడు ఆయనను స్వర్గానికి పిలుచుకొనిపోవ నిశ్చయించుకొని తగు సన్నాహముతో ఒకనాడాయన సన్నిధికి వచ్చి, 'అయ్యా! మీరు స్వర్గమునకు దయచేయవలెను' అని ఆహ్వానించాడు. అప్పుడు శరభంగుడు, 'ఇంద్రా! నాకు స్వర్గమక్కరలేదు. శ్రీరామచంద్రుడు నా ఆశ్రమమునకు వస్తున్నాడు. ఆ పరమాత్ముని సందర్శించుటకంటె నాకు స్వర్గమెక్కువైనది కాదు. నీవు కావలెనంటె శ్రీరామచంద్రుని దర్శించుకున్న పిమ్మట నేను స్వర్గానికి వస్తాను. అంతవరకు నా ఆశ్రమము వదలి రాను' అన్నాడు.

వసిష్ఠ మహర్షి ఒకానొక సమయంలో దశరథునితో చెప్పాడు, 'నీ నుండి ధనధాన్యములు నాకేమీ అక్కరలేదు. నీ దగ్గర పురోహితునిగా వచ్చి ఉండటానికి నాకేమీ అవసరం లేదు. ఐతే, నీ గృహంలో సాక్షాత్ నారాయణమూర్తి ఉద్భవిస్తున్నాడు. అతని చర్యలు చూడాలని, అతని సేవలు చేయాలనే సదుద్దేశ్యంతో నేను నీ దగ్గర పురోహితునిగా పని చేస్తున్నాను. ఆ దైవం కోసమే నేను నీ ఇల్లు చేరాను' అన్నాడు.

మతంగమహర్షి శబరిని ఉద్దేశించి, 'శబరీ! శ్రీమన్నారాయణుడు రామావతారమెత్తి, తన తండ్రి ఆజ్ఞను పురస్కరించుకొని తాపసవేషమునుబూని అరణ్యములో సంచరిస్తున్నాడు. అతడు ఆజానుబాహుడు. అలాంటి పవిత్రమూర్తి మన ఆశ్రమానికి కూడా

వస్తాడు. ఆ సమయమునకు నేను ఇక్కడ ఉండను. కనుక, నీవు భక్తి పూర్వకంగా అతనికి స్వాగతం పలికి సత్కరించుము' అని బోధించాడు.

***రామ జనన శుభసమయం***

'మధు..మాధవ' అనే ఈరెండునెలల మార్పులే వసంత ఋతువు. వసంత ఋతువు అనగా సూర్యుడు మేష, వృషభ రాసులందు ప్రవేశించటము. ఈ రాసులనే శుక్ర రాశి అని చెబుతారు. ఈ శుక్ర రాశి కేవలము నీలవర్ణముతో కూడిన, తెలుపుగానుండిన జీవితమును ప్రబోధిస్తుంది. ఈ నీలివర్ణముతో కూడిన భగవత్తత్త్వం లోకముయొక్క విశాలతత్త్వం, ఆరోగ్యం, ఆనందం సూచించు మూల చిహ్నాలుగా ప్రబోధిస్తూ వచ్చింది. సూర్యుడు మేష రేఖపైన, చంద్రుడు కర్కాటక రేఖపైన ఉన్నప్పుడు పునర్వసు నక్షత్రం ప్రవేశిస్తుంది. శుక్రుడు మీనములో ప్రవేశించినప్పుడు, శ్రీరామచంద్రుడు జననమొందుట సంభవించినది. అదే రామ జనన శుభలగ్నం. లోకమున శాంతిభద్రతలు అందించే నిమిత్తమై, మానవత్వమందున్న దివ్యత్వము ఆవిర్భవించే నిమిత్తమై రామతత్త్వము ఆవిర్భవించింది.

***కర్మలే జన్మలకు మూలకారణం***

*కర్మమునబుట్టుజంతువు*
*కర్మముననె వృద్ధిపొందు కర్మమున చనున్*
*కర్మమె నరునకు దైవము*
*కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలో.*

మనకు సంభవించుచుండు మంచిచెడ్డలకు మూలకారణము మన కర్మలే. మన జన్మకు హేతువుకూడా కర్మయే. కర్మము, జన్మము, పునర్జన్మము అను మూడు లక్షణములను విశ్వసించినది హిందూమతము. మిగిలిన మతములందు, యీ మూడింటిలో యేదైననూ లేకుండా ఉండవచ్చునుగాని, హిందూమతము యీమూడును ప్రధానమైనవిగా విశ్వసించినది. మానవ జన్మమునకు మూలకారణము కర్మ అగునేని, శ్రీమన్నారాయణుడు మానవావతారము ధరించినాడుకదా! ఆ మానవావతారమునకు పూర్వము కొన్ని కర్మలు ఉండి ఉండవచ్చునా అనే సందేహము మీకు కలుగవచ్చును. మానవునియొక్క జన్మకు అతని మంచి చెడ్డ కర్మలే మూలకారణమైనట్లుగా నారాయణుడు మానవుడుగా అవతరించుటకును, మంచిచెడ్డ కర్మలే మూలకారణము. కాని, అందులో కొంత వ్యత్యాసము కన్పించును. మానవుడు చేసిన కర్మలు, అతనికి మాత్రమే వర్తిస్తుంటాయి. అవతార లక్షణము అట్టిది కాదు. దుష్టులు చేసిన దుష్కర్మ, సజ్జనులు చేసిన సత్కర్మ. ఈ రెండు కూడను అవతారములకు మూల కారణము. ఇది నరసింహావతారమునందు మనకు చక్కగా గుర్తుకు వస్తుంది. ప్రహ్లాదుడు చేసిన సత్కర్మ, హిరణ్యకశిపుడు చేసిన దుష్కర్మ,ఈ రెండు కర్మలూ నారాయణుడు నరసింహరూపము ధరించుటకు కారణమైనది. రామావతారమునకు కూడను అనేక కారణాలు ఉంటున్నాయి. పూర్వము దేవాసురులకు యుద్ధము జరుగుచున్న సమయములో, అసురులు భృగుమహర్షి భార్యను ఆశ్రయింపగా, ఆమె వారికి కొంత సహాయపడింది. వారిని ఆమె ఆదుకోటంచేత, వారికి కొంతవరకు అపాయం తగ్గింది. ఈవిషయము నారాయణునకు తెలిసిన తక్షణమే నారాయణుడు భృగుమహర్షియొక్క భార్య శిరస్సు ఖండించాడు. వెంటనే భృగువు భార్యావియోగము భరించలేక, 'మానవావతారములో భూలోకమునకు దిగివచ్చినప్పుడు నీవుకూడా భార్యావియోగము అనుభవింతువుగాక!' అని నారాయణునికి శాపమిచ్చాడు. ఇందులోని అంతరార్థమేమనగా ప్రతి కర్మకు ప్రతీకారము, ప్రతిఫలము, ప్రతిధ్వని ఏర్పడుతూనే ఉంటాయి. నారాయణుడైనప్పటికి నరావతారంలో వచ్చినప్పుడు, తానుకూడను, తనయొక్క కర్మల ప్రతిఫలాన్ని లోకానికి ఆదర్శవంతముగా అనుభవిస్తూ ఉంటాడు.

***సుఖదుఃఖాలన్నీ కర్మఫలాలే***

ప్రతి మానవుని ఏదో ఒక కర్మఫలము అనేకరకములుగా పీడిస్తునో, ఆనందిస్తునో ఉంటుంది. అడవిలో బంగారు జింకను తరుముకొని రాముడు వెళ్ళినప్పుడు, 'హాసీతా! హా లక్ష్మణా!' అనే శబ్దము వినిపించింది. ఈ శబ్దము మారీచుని శబ్దమని లక్ష్మణునికి చక్కగా తెలుసు. అందువలన లెక్కచేయక, సీతమ్మవారిని కాపాడుకుంటూ, తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాడు లక్ష్మణుడు. ఆ పలుకుల చెవులయందు పడిన తక్షణమే, సీత, గగుర్పాటుగా కంగారుపడుతూ, 'లక్ష్మణా! రాములకేదో కష్టము సంభవించింది. నీవు తక్షణమే వెళ్ళు' అని అతనిని అనేక విధములుగా తొందరపెట్టింది. రాక్షసుల మాయలను చక్కగా గుర్తించినవాడు కనుక, లక్ష్మణుడు ఆమె మాటలను యేమాత్రము లెక్కచేయక చిరునవ్వు నవ్వుతూ, 'రాములకు ప్రమాదము సంభవించటమేమిటి తల్లీ! ఇది నీ భ్రాంతి. రామునికి ఎట్టి ఆపదలు రావు' అని చెప్పాడు. మరికొంతసేపటికి మారీచుడు 'హాసీతా! హాలక్ష్మణా!' అని మళ్ళీ అరిచాడు. ఇక సీత భరించలేకపోయింది. లక్ష్మణునకు అనేకవిధములుగా చెప్పింది. కాని లక్ష్మణుడు కదలలేదు. అది చూచి సీత కొన్ని అనరాని మాటలంది. 'రాముడు మరణించిన నన్ను పొందవచ్చునని ఈ మార్గాన్ని అనుసరిస్తున్నావా? నీవు వెళ్ళకపోతే నేను ఆత్మహత్య చేసుకుంటాను. అగ్నిలో పడి ప్రాణత్యాగము చేసుకుంటాను' అని అఘాయిత్యమునకు సిద్ధపడింది. సీత నిష్ఠూరపు మాటలు వినలేక,

ఆ స్థలమునందుండలేక, అక్కడనుండి కదలలేక నిర్భంధంగా ఆశ్రమాన్ని వదలిపెట్టి బయలుదేరాడు లక్ష్మణుడు. నిరపరాధియైనట్టియు, నిర్మల చిత్తుడును, పవిత్ర హృదయుడు అయిన లక్ష్మణుని ఆడిన మాటలు చాలా కష్టమైనవిగా ఉంటున్నాయి. సీతమ్మవారు సామాన్యమైన స్త్రీ కాదు. శ్రీమన్నారాయణునియొక్క సతి. సాక్షాత్ లక్ష్మీదేవి. అయినప్పటికీ కర్మ ఫలము అనుభవించక తప్పదు. రావణ వధ తరువాత, అగ్నిపరీక్ష సమయమందు, రామచంద్రుడు అనేక రకములైన కఠిన వాక్యములాడాడు. పదినెలలు రామదర్శనమునకై కాచియున్న ఈ సీత రామదర్శనమునకై వచ్చినప్పుడు, రాముడు యేమాత్రమూ కరుణ, జాలి అనేది చూపక కఠినమైన వాక్కులతో ఆమె హృదయమును నొప్పించాడు. ఆమె కంటిధారలు కారుస్తూ, ఆ వానరులమధ్య నిలచియున్న సమయమందు, 'సీతా! నిన్ను యిక నేను పరిగ్రహించను. నీకిష్టమైన లక్ష్మణునితోనో, భరతునితోనో, శతృఘ్నునితోనో లేక విభీషణునితోనో, సుగ్రీవునితోనో ఉండు' అన్నాడు. రాముడు కఠినమైన మాటలు ఆడినప్పటికి అతని హృదయమునకు సీతయొక్క హృదయము తెలియకపోలేదు. కాని, ఆనాడు లక్ష్మణుని అన్న మాటలకు సీత ప్రతిఫలము అనుభవింపవలసి యున్నది. కనుక, సీతను కూడను రాముడు అంత కఠినమైన మాటలు అన్నాడు. ఈ మాటలు విన్న తక్షణమే సీత, ఆనాడు లక్ష్మణుని ఆడిన మాటలకు ఇది ప్రతిఫలములైన మాటలని గుర్తించింది. ఈ ఘట్టము మానవులకు ఆదర్శవంతమైనది. be good, see good, do good అనే సూక్తి నేర్పుతున్నాది.

***మనోవాక్కాయములు...త్రిపుటి***

ప్రశాంతమైన మనస్సు, సత్యపూరితమైన వాక్కు, సేవామయమైన శరీరము యిది త్రిపుటి. ఇట్టి త్రిపుటి స్వరూపుడే మానవులలో శ్రేష్ఠుడు. ప్రపంచము ఏవిధంగా ఉండాలి, పరిపాలన ఏవిధంగా జరగాలి, మానవత్వంయొక్క శీలసంపదను ఏవిధంగా పోషించుకోవాలి అనే సత్యస్వరూపాన్ని నిరూపించినవాడు రామచంద్రుడు. ఉత్తమమైన చర్యలు, ఆదర్శవంతమైన గుణములు, పవిత్రమైన ఆలోచనలు ఈమూడింటి స్వరూపమే శీలమునకు పునాది. ఈమూడింటి సమ్మిళిత స్వరూపమే రామస్వరూపము. అనగా సంకల్పములు, చర్యలు, గుణములు యీమూడింటి యేకత్వము ప్రతి మానవునికి అత్యవసరము. ఇలాంటి సత్యాన్ని అనుభవించి, ఆనందించి, అందించినవాడు రాముడు. తాను సత్యమునే పలికేవాడు. ధర్మమునే ఆచరించేవాడు. ప్రియమైన వాక్యములచేత పరులను సంతృప్తి పరచేవాడు. పరుల విషయములో ప్రవేశించక, పరులను పరిహసించక, పరుల దోషములను చూడక సంచరించేవాడు రాముడు.

దశరథుడు తన పిల్లలను ఐదవ సంవత్సరంలో ఉపనయన సంస్కారం గావించాడు. తరువాత విద్య నేర్పించే నిమిత్తమై నలుగురు పిల్లలను వసిష్ఠులవారి వద్ద చేర్చాడు. పదవ సంవత్సరము లోపలనే సమస్త వేదములు నేర్చుకున్నారు. లౌకిక విద్యలలోనేగాక నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విద్యలలోకూడా ప్రవీణులుగా రూపొందారు.

సర్వే వేదవిదశ్శూరా స్సర్వే లోకహితే రతాః
సర్వే జ్ఞానోపసంపన్నా స్సర్వే సముదితా గుణైః.

సమస్త లోకముల హితమునూ కోరుతూ వచ్చారు. విశాల హృదయులుగా రూపొందుతూ వచ్చారు. సమస్త జ్ఞానమును తెలుసుకొన్నవారు. లౌకిక జ్ఞానములు చిన్నచిన్న నదులవంటివి. ఆధ్యాత్మిక జ్ఞానము సాగరము వంటిది. 'నదీనాం సాగరో గతిః' ఈ చిన్నచిన్న నదులన్నియూ సాగరములోనే కలసిపోతున్నాయి. అట్టి సాగర స్వరూపమైనట్టి ఆత్మజ్ఞానాన్ని, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అభ్యసించారు. ఈ నలుగురూ సర్వసద్గుణ సంపన్నులైనారు. తరువాత, అస్త్రశస్త్ర విద్యలనభ్యసించి ప్రవీణులైనారు. కైకయే మొట్టమొదట అస్త్రశస్త్ర విద్యలను శ్రీరామునికి నేర్పనారంభించింది. ఈమె ఈ విద్యలలో ప్రవీణురాలు. రాముడంటే కైకకు ప్రాణము.

విశ్వామిత్రుని యాగ సంరక్షణార్థమై సిద్ధాశ్రమమునకు చేరారు రామలక్ష్మణులు. అది విశ్వామిత్రుడు యాగం చేయ సంకల్పించిన స్థలము. ఈ స్థానములోనే ఎందుకు యాగం చేయ సంకల్పించాడు? శ్రీమన్నారాయణమూర్తి వామనావతారం ఎత్తి జీవించి, కశ్యపుని గృహమందు తాను కలసిమెలసి తిరిగిన స్థలమది. అప్పుడు రామునితో విశ్వామిత్రుడు చెప్పాడు, 'ఓ రామా! ఇక్కడ ఒక గొప్ప రాక్షసి ఉంది. దాని పేరు తాటకి. నూరు ఏనుగుల బలము కలది. దానిని మీరు సంహరించాలి'. 'స్త్రీ హత్యను నేను అంగీకరించను' అన్నాడు శ్రీరాముడు. లోకకంటకులైన వారిని ఎవరైనా సరే చంపటంలో తప్పులేదు' అన్నాడు విశ్వామిత్రుడు. 'ఓ రామా! మీరు సర్వజ్ఞులు, సర్వధర్మస్వరూపులు. లోకకంటకులైనవారు స్త్రీలు అయినా వధించవచ్చు. ఆడమగ లింగ భేదము లేదు. రాక్షసులు అని చెప్పగా శ్రీరాముడు, 'విశ్వామిత్రా! ఈవిధంగా స్త్రీలను సంహరించినవారు ఎవరైనా ఉన్నారా?' అని అడిగాడు. అప్పుడు విశ్వామిత్రుడు, ' లేకేమి రామా! ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. ఈ విరోచనునికి ఒక బిడ్డ ఉండేది. ఆమె మంథర. ఈమె మహా కఠినమైన రాక్షస కృత్యములలో ప్రవేశించి, లోకక్షేమమునకు అనేక అడ్డంకులు కలిగిస్తుండగా, ఇంద్రుడే ఈ మంథరను సంహరించాడు. అదేవిధముగా భృగు పత్ని మహా కౄరమైన మార్గంలో ప్రవేశించి దేశ సంక్షేమానికి విరుద్ధంగా నడుస్తూ రాగా, విష్ణువే ఆమెను సంహరించాడు' అని చెప్పాడు. ఈ మాటలు విని లోకమునకు అపకారము చేసే వారిని చంపుటలో తప్పు లేదనే నిర్ణయానికి వచ్చాడు శ్రీరాముడు. ఈవిధమైన సంభాషణ జరుగుతుండగనే ఒక భయంకరమైన శబ్దం వచ్చింది. తాటకి వచ్చింది.

రాళ్ల వర్షం కురిపించింది. లక్ష్మణుడు బాణం వేశాడు. ఆ వర్షం నిలిచిపోయింది. మరి అగ్నివర్షం కురిపించింది, రక్తవర్షం కురిపించింది. రాముడు కూడను ఎదుర్కొంటూ వచ్చాడు. తాటకి లోకకంటకురాలనే విషయం రామునికి ఇప్పుడు బాగా అర్థమైంది. తాను మాయమై పెద్దపెద్ద వికార శబ్దములు చేస్తూ వచ్చింది. రాముడు శబ్దభేదిని ఉపయోగించాడు. ఒక్క క్షణంలో ఈ రాక్షసి కూలి క్రింద పడిపోయింది. మరి కొంతసేపటికి మారీచ, సుబాహులు అనే ఈమె కుమారులు వచ్చారు. వీరు కూడా అనేక శబ్దములు చేస్తూ రక్తవర్షము, అగ్నివర్షము కురిపించారు. రాముడు అప్పుడు మంత్ర అస్త్రమును ప్రయోగించగా, అప్పుడు మారీచుడు నూరు మైళ్ల దూరములోనున్న సముద్రములో పడిపోయినాడు. సుబాహుని పైన ఆగ్నేయాస్త్రము ప్రయోగించగా అక్కడికక్కడే దగ్ధమైపోయినాడు. వీరితో వచ్చిన పరివారంపై వాయవ్యాస్త్రమును ప్రయోగించగా అందరూ శూన్యమైపోయినారు. సిద్ధాశ్రమములో ప్రశాంతమైన వాతావరణం ఏర్పడింది. ఆశ్రమవాసులందరూ సంతోషంతో శ్రీరాముని ప్రశంసించారు. విశ్వామిత్రుడు ప్రారంభించిన యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగింది. పూర్ణాహుతి వరకు నీరైనా త్రాగకుండా, రాత్రింబవళ్లు రామలక్ష్మణులు యాగ ప్రదేశమును కాపలా కాస్తూ వచ్చారు. మాట యిచ్చినప్పుడు మధ్యలో వదలకూడదు. అదే దీక్ష. యజ్ఞం నిర్విఘ్నంగా పూర్తయింది.

### *రాముని త్యాగగుణం*

భగవంతుడు హృదయనివాసి. మన హృదయమంతా ప్రేమమయం కనుక, ఆ ప్రేమను పదిమందికి పంచాలి. సుఖములందైనా, దుఃఖములందైనా ప్రేమను మాత్రము పంచాలి. రామునిది మహా త్యాగగుణము, దానగుణము, ఈరెండే మానవునికి ప్రధానమనే ఆదర్శమును రామతత్త్వం బోధించింది. రాముడు అరణ్యానికి వెడుతున్నాడని అందరికి తెలిసింది. వృద్ధుడైన ఒక బీద బ్రాహ్మణుడు కూడా ఈ వార్తను విన్నాడు. 'అయ్యో...! శ్రీరామచంద్రుడు పదునాలుగు సంవత్సరాలు అరణ్యానికి వెడుతున్నాడుట. ఆయన తిరిగి వచ్చేంతవరకు నేను బ్రతుకుతానో లేదో..' అని చింతించాడు. ఆ వృద్ధ బ్రాహ్మణుని పేరు 'త్రిజటుడు'. శ్రీరామచంద్రుని కట్టకడపటిసారిగా దర్శించి పోదామని అతడు అనేక శ్రమలకోర్చి నడుచుకుంటూ వచ్చాడు. ఆ సమయంలో రాముడేమి చేస్తున్నాడు? ఒక్క నిముషంలో పట్టాభిషిక్తుడు కావలసిన రాముడు మరొక నిముషంలో అరణ్యవాసానికి సిద్ధమైనాడు. ఏ మానవుడైనా సహనంతో దీనిని అనుభవించగలడా? ఎన్నివిధములైన విచారములతో కృంగిపోతాడో! కానీ, రాముడు ఆవిధంగా కృంగలేదు. పైగా తన వస్తువులను, తన ఆభరణములను అన్నింటిని బీదలకు పంచిపెట్టసాగాడు. ఈవిధముగా దుఃఖసమయ మందుకూడా ప్రజలకు ఆనందాన్ని పంచటమేగాక త్యాగమును బోధిస్తూ వచ్చాడు. తన వద్దకు వచ్చిన బ్రాహ్మణులందరికి గోశాలలోనున్న గోవులనన్నింటిని దానమిచ్చాడు. తాను పవళించే హంసతూలికా తల్పముతోసహా సమస్త సామగ్రిని పంచిపెట్టాడు. ఈ దృశ్యాన్ని చూశాడు త్రిజటుడు. 'ఆహా! భగవంతుడెంతటి త్యాగస్వరూపుడు! న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః' అన్నట్లుగా ఇతడు అమృత పుత్రుడే! ఇతడు నిజముగా అమరుడే! ఇతడు నిజంగా ఆనంద స్వరూపుడే!' అనుకొని ఒక్కసారి చేతులు జోడించి, 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నాడు.

శ్రీరాముడు ఆ బీద బ్రాహ్మణుని చూచి దగ్గరకు పిలిచాడు. 'ఓ బ్రాహ్మణోత్తమా! నీ రాకకు గల కారణమేమిటి?' అని ప్రశ్నించాడు. 'స్వామీ! నేను వృద్ధుడనైపోయాను. మీరు పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసం చేయబోతున్నారుట. అంతవరకు నేను బ్రతుకుతానో లేదో. కనుక, ఒక్కసారి మీ సుందర వదనాన్ని దర్శించి, మీ ప్రేమ తత్త్వాన్ని అనుభవించి, మీ పాదములను పట్టి ప్రార్థించి నా జన్మను సార్థకము చేసుకోవాలని వచ్చాను' అన్నాడు. 'మరి యే యితర ఆశ నీకు లేదా?' అని శ్రీరాముడు ప్రశ్నించగా, 'నాకు యితర ఆశలు యేవీ లేవు. నా యింట్లో కూటికి కాస్త కష్టంగానే ఉంటున్నది. కాని, అది మానవుని కర్మానుసారం జరుగుతుంటుంది. దీనికి నేను యేమాత్రం వగచను. నీ దర్శన స్పర్శన సంభాషణములే నాకు ప్రధానము' అన్నాడు. 'ఐతే యీ మూడింటి వల్ల కలిగే ఫలితము యేమిటి?' అని అడిగాడు రాముడు. 'స్వామీ! దర్శనం పాప నాశనం, స్పర్శనం కర్మ విమోచనం, సంభాషణం సంకట నాశనం' అన్నాడు. రాముడు చాలా సంతోషించి ఆ వృద్ధుని ఆలింగనం చేసుకున్నాడు. 'నాయనా! ఈ స్పర్శ నీకానందంగా ఉందా?' అని అడుగగా, ఆ వృద్ధుడు ఆనంద భాష్పాలు రాల్చుతూ, 'స్వామీ! నాకు స్వర్గమంటే యేమిటో, కైలాసమంటే యేమిటో, వైకుంఠమంటే యేమిటో తెలియదు. కాని, నీ స్పర్శలోనే నేను ఈ మూడింటిని అనుభవించాను' అని పలుకుతూ చేతులు జోడించి, 'మీరు ఆజ్ఞ యిస్తే నేను వెళ్ళి వస్తాను' అన్నాడు.

'నాయనా! నా చేతులు వట్టివి కావు. నా చేతులు గట్టివి. నీ ప్రేమను నేనందుకున్నప్పుడు నా ప్రేమనుకూడా నీకందించాలి' అన్నాడు రాముడు. ఆ వృద్ధుని చేతిలో ఒక కఱ్ఱముక్క ఉంది. 'నాయనా! నా స్పర్శచేత నీకు దండిగా శక్తి వచ్చినది. నీ వృద్ధాప్యం అంతర్ధానమైపోయింది. ఈ కఱ్ఱను నీవు ఎంత దూరం విసురుతావో విసురు. ఆ ప్రదేశములోపల గల ధన కనక వస్తువాహనాదులే కాకుండా గోసంపత్తిని కూడా నీకే అందిస్తాను' అన్నాడు రాముడు. రాముని స్పర్శచేత ఆ వృద్ధునికి అనంతమైన శక్తి వచ్చింది. 'భగవంతుని ఆజ్ఞను శిరసావహించకపోతే నా జీవితం వ్యర్థం. నాకు ఎట్టి ఆశా కూడా లేదు. కాని, రామాజ్ఞను శిరసావహించే నిమిత్తమై ఈ కఱ్ఱను విసురుతాను' అనుకొని ఆ కఱ్ఱను విసిరాడు. రామానుగ్రహ ప్రభావముచేత ఆ కఱ్ఱ సరయూనది అంతయూ తిరిగి రాముని దగ్గరకే వచ్చింది. అనగా అనేక భవనములు, అనేక ఆస్తులు, అనేక గోవులు ఆ బ్రాహ్మణుని స్వాధీనమైపోయాయి.

'స్వామీ! నేను వచ్చింది నీ దర్శనం కోసమే! ఇంత బరువు నాకెందుకు?' అని పలుకగా, 'బ్రాహ్మణోత్తమా! ఇది నీ జన్మాంతర ప్రాప్తి. నీవీ జన్మలో చేసినటువంటిది కాదు. నేను అరణ్యానికి వెడుతున్నాని తెలిసీ రాలేక పోయిన వారెంతమంది...! కనుక, నీ భావమే నీ ప్రేమకు మూలకారణం' అన్నాడు రాముడు.

### *భగవంతుని దయ సాటిలేనిది*

మానవమాత్రులైన అధికారులకంటె అధికమైన దయ భగవంతునికి ఉన్నది. తన భక్తులను ఆదుకోటానికి అనేక భూమికలను ధరిస్తూ ఉంటాడు. ఒక భక్తుడు ఉండేవాడు. సీత తన సోదరి అని భావించుకొని రాములవారిని బావ అని చనువుగా సంబోధించేవాడు. రాముని వెంట సీత అరణ్యానికి వెళ్ళిందని తెలుసుకున్నాడు. ముళ్ళడొంకలుండే అడవుల్లో చెప్పులు లేకపోవటం వల్లను, పాములు విచ్చలవిడిగా తిరిగే ప్రదేశాల్లో మంచం లేకపోవటం మూలంగాను యెంతో బాధపడుతున్నదని ఊహించుకున్నాడు. చెప్పులు, మంచము పట్టుకొని అడవికి పోయి 'సీతా! సీతా!' అంటూ గొంతు బొంగురుపోయేటట్లు అరుస్తూ తిరిగినాడు. ఇది జరిగి కొన్ని దశాబ్దములైనది. రామాయణ గాథను సమకాలికమైనదిగా ఆ భక్తుడు తలపోశాడు.

ఒకనాడు రాముడు సాక్షాత్కరించి ఓదార్చినాడు. భక్తుడు రాముని పాదాలమీద పడి తను తెచ్చిన చెప్పులు, మంచము స్వీకరించవలసినదని బ్రతిమాలుకున్నాడు. తన సోదరి సీత ముళ్ళదారిలో చెప్పులు లేకుండా నడవజాలదనీ తను తెచ్చిన చెప్పులు, మంచము పుచ్చుకుంటేగానీ తన మనస్సుకు సుఖం లేదనీ విన్నవించుకున్నాడు. 'ప్రియమైన బావగారూ!' అని రాములవారిని ఎంతో చనువుగా సంబోధించాడు. రాముడు వాటిని అందుకొని నువ్వు ఆనందంగా వెళ్ళవలసినదని చెప్పాడు. అహంకారంతో కలుషితం కానటువంటి కానుకలు భగవంతుడు సంతోషంగా అందుకుంటాడు.

### *సీతారాములు ప్రకృతిపరమాత్మలే*

జనకమహారాజు ఆస్థానమునందు శ్రీరామచంద్రుడు శివధనస్సును విరిచినప్పుడు ధనస్సు మాత్రమే విరిగినదిగాని నారి తెగలేదు. ఆ ధనస్సునకు అటువైపు, ఇటువైపునున్న భావములు రెండూ ఏకమయ్యే ఉంటున్నాయి. ఈ రెండింటికి సంబంధబాంధవ్యమును కలిపిన నారియే ప్రకృతి. ఆ ధనస్సునకు అటువైపున, ఇటువైపున ఉన్న స్థానములే సీతారాములు. సీతారాములనగా ప్రకృతిపరమాత్మలే. సీత భూజాత. అనగా ప్రకృతి. రాముడు పురుషుడు. ఈ ప్రకృతిపురుషుల సంబంధబాంధవ్యమునే రామాయణము చక్కగా బోధిస్తూ వచ్చింది. శుద్ధసత్వమైన పరమాత్మకు, సాత్వికగుణములు కలిగిన సీతకు అనగా ప్రకృతికి ఏకత్వము సంభవించినది. ప్రకృతిపరమాత్మ విభజన ఏనాటికీ సంభవించేది కాదు. సర్వకాలసర్వావస్థలందు సంయోగముతో కూడినదేగాని వియోగముతో కూడినది కాదు. అట్టి వియోగము అసంభవము.

### *ముత్యాల తలంబ్రాలు*

ఈ ఏకత్వమునకే కళ్యాణమని పేరు. జనకమహారాజు ఈ కళ్యాణాన్ని సమస్త వైభవములతో గావిస్తున్నాడు. ఈ సందర్భమున శ్రీరాముడు త్రిగుణాత్మకమైన ప్రకృతిని ప్రదర్శించాడు. ప్రాచీనకాలమునుండి భారతీయుల వివాహములందు 'తలంబ్రాలు' అనే పద్ధతి జరుగుతూ వస్తోంది. సీతారాముల కళ్యాణములో జనకమహర్షి మహారాజు కనుక తలంబ్రాల నిమిత్తమై బియ్యంతో తట్టలు తెప్పించలేదు. తెల్లని మల్లెమొగ్గల వంటి ముత్యాలను తట్టలో నింపి తెప్పించాడు. తలంబ్రాల సమయము ఆసన్నమైంది. సీతాదేవి ఆ ముత్యాలను తన దోసిళ్ళలో నిండుగా తీసుకొన్నది. శ్రీరామచంద్రుడు తన శిరస్సునకు తెల్లని మల్లెపూవువంటి వస్త్రముతో తలపాగ చుట్టుకొనియున్నాడు. సీతాదేవి ప్రకృతి స్వరూపిణి. ఆమె అరచేతులు ఎఱ్ఱగా రక్తమువలె ప్రకాశిస్తున్నాయి. ఆ సమయమందు సీతాదేవి తన చేతులతో మంచిముత్యాలను పట్టుకొన్నప్పుడు. ఎఱ్ఱని కాంతి కల్గిన ఆ సీతాదేవి హస్తములందు తెల్లని ముత్యాలు చేరుటచేత. ఆ ముత్యాలందు కూడా సీతాదేవి హస్తముల రంగు ప్రతిబింబిస్తూ వచ్చింది. అవి ఎఱ్ఱ రంగుతో ప్రకాశించాయి. వెంటనే సీతాదేవి ఆ ముత్యాలను శ్రీరామచంద్రుని శిరస్సుపైన పోసినప్పుడు శ్రీరాముడు ధరించియున్న ఆ తలపాగాయొక్క పరిశుద్ధమైన తెల్లని రంగు ముత్యములందుకూడా ప్రకాశిస్తూ ప్రతిబింబిస్తూ వచ్చినది. శ్రీరామచంద్రుని శిరస్సును వదలి అవి క్రిందపడగానే, శ్రీరాముడు నీలమేఘశ్యాముడగుటచేత ఆ తలంబ్రాల పైన అతని శరీరపు నీడసోకి ఆ ముత్యములన్నీ నీలవర్ణముతో ప్రకాశింప సాగినవి. తెల్లని ముత్యాలు సీతాదేవి హస్తములందు చేరగనే ఎఱ్ఱని కాంతిని పొందినవి. ఈ ముత్యములే శ్రీరామచంద్రుని తెల్లని తలపాగ పైనబడి తెల్లని కాంతిని ఆశ్రయించినవి.

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు అయోధ్యకు ప్రయాణమైనారు. కాని, భరతశత్రుఘ్నుల భార్యలు మాండవీశ్రుతకీర్తులు, 'మేము యింకా కొంత కాలము తరువాత వస్తాము' అని చెప్పారు. వీరిద్దరు కుశధ్వజుని బిడ్డలు. అయితే నలుగురు కోడళ్ళూ ఒకే పర్యాయం బయలుదేరాలన్నాడు దశరథుడు. శృతకీర్తికి చాలా చక్కగా శకునములు తెలుసు. ఈనాడు వెళ్లటం మంచిది కాదని అక్క మాండవితో చెప్పింది. ఊర్మిళ సీతతో చెప్పింది. సీత చెప్పింది, 'పిచ్చిదానా! భగవంతుడే మన వెంట వస్తుండగా, ఈ ముహూర్తాలు మనకెందుకు? కాలమే అతని స్వరూపము. కాలమంతయూ అతని హస్తములో ఉంటున్నది. కాలాత్మకుడు, కాలస్వరూపుడు, కాలనియామకుడు. అటువంటి పరమాత్ముడే మన వెంట ఉండగా, ఈ కాలమును మనం చూడనవసరం లేదు. ఒకవేళ ఏమైనా

అభ్యంతరాలు జరిగినా రాముడే చూసుకుంటాడు' అని ధైర్యం చెప్పింది. అందరూ ప్రయాణమైనారు. మిథిలాపుర ప్రజలు సాగనంపటానికి వెంట వస్తున్నారు. కంట తడి పెడుతున్నారు. మహా కర్మయోగి జనకమహారాజు కూడను ఇరువురు కుమార్తెలను దగ్గరకు తీసుకొని కంటిధారలు కార్చాడు. ప్రజలందరూ ఆశ్చర్యపడ్డారు. 'ఇది దుఃఖం కాదు నాయనా! ఈ ప్రకృతి పరమాత్మయొక్క చేరికను నేను చూడాలని ఇంతకాలం వేచివున్నాను. ఈనాడు ప్రకృతి పరమాత్మ యొక్క చేరికయే జరిగింది. ఈ ఆనందమును నేను భరించుకోలేక పోతున్నాను' అని చెప్పి తన రాజ్యమును, తన సర్వస్వమునూ, తన శక్తినంతనూ వారికే అర్పించాడు. రథ గజ తురగములన్నింటిని పంపించాడు. కొంతదూరం ప్రయాణం చేశారో లేదో, ఒక పెద్ద శబ్దం వినిపించింది. 'నిలు! నిలు!' అన్నాడు. ఎవరా అని చూస్తే పరశురాముడు. రాముడు శివధనుస్సును విరిచాడని, దైవశక్తిని అవమాన పరిచాడని, ఇతనిపైకి యుద్ధం చేయటానికి వచ్చాడు పరశురాముడు. 'రామా! నీ శక్తి నేను చూస్తాను' అన్నాడు. రెండు చేతులూ జోడించి, 'పరశురామా! నీతో యుద్ధం చేయటానికి నేను సిద్ధముగా లేను. నీకేదైనా అనుమానం ఉంటే, నేను తీరుస్తాను' అన్నాడు. పరశురాముడు ఆ అస్త్రాన్ని ముందు పారేశాడు. రాముడు ఒక్కతూరి తీసి దానిని విరిచాడు. విరిచిన తక్షణమే పరశురాముడు రాముని పాదాలపై పడ్డాడు. అనగా దీని అంతరార్థం ఏమిటి? భగవంతునకు పదహారు కళలు. ఈ కళలలో పండ్రెండు శ్రీరామచంద్రునివి. ఇంకా మూడు కళలు లక్ష్మణ భరత శతృఘ్నులవి. మొత్తం పదిహేను అయినాయి. ఇకపోతే పరశురాముని వద్ద ఒక శక్తి ఉన్నది. దానిని శ్రీరామచంద్రునికి అర్పించే నిమిత్తమై పరశురాముడు వచ్చాడు. రామునిపై ద్వేషంతో వచ్చాడని భావిస్తుంటారు కొందరు. ఇది ద్వేషము కాదు. ఇది అర్పణ. తన వద్దనున్న శక్తిని అప్పగించటానికి, అర్పించటానికి వచ్చాడు పరశురాముడు. కనుకనే పదహారు కళలతో కూడినవాడై పరిపూర్ణుడైనాడు శ్రీరామచంద్రుడు. పరశురాముని చూసిన తక్షణమే దశరథుడు వగైరాలు ఏమవుతుందోనని భయపడుతూ వచ్చారు. శ్రీరామచంద్రుడు మాత్రం చిరునవ్వును చిందిస్తున్నాడు. ఎన్ని ఉపద్రవములు వచ్చి మీద పడినా భగవంతుడు మాత్రం చిరునవ్వును చిందిస్తాడు. ఎన్ని ఉపద్రవములు వచ్చి మీదపడినా భగవంతుడు ఏమాత్రం మారడు, భయపడడు, చలించడు. ఎప్పుడూ ఆనందముగానే ఉంటాడు. ఎట్టి పరిస్థితులయందు అతని తేజస్సు మారదు. మానవుని యందు ఓజస్సు ఉండటం వలన మారుతుంది. భగవంతునిలో తేజస్సు ఉండటం వలన మారదు. ఇది దైవత్వము యొక్క ప్రధానమైన కళ. దివ్యత్వముచేత ఆనందాన్ని పదేపదే అనుభవించి ఆనందించేవాడు దివ్యత్వమైన దైవత్వము.

### *ప్రజల ఆనందమే రామరాజ్య లక్ష్యము*

ప్రజలకు సంపూర్ణ స్వాతంత్ర్యమునందించి, ప్రజలే తనయొక్క జీవితముగా భావించి, ప్రజలయొక్క క్షేమమే తన కళ్యాణముగా విశ్వసించినవాడు శ్రీరామచంద్రమూర్తి. నేను రాజునుకదా ప్రజలు నా చేతిక్రిందివారు అనే అహంకారముగాని, ఏవిధమైన అసూయకుగాని, ఎట్టి చెడ్డభావములకుగాని రాముని చిత్తమందు యేమాత్రమూ స్థానము లేదు. ప్రజలయొక్క సారథిగా తాను భావించుకునేవాడు శ్రీరామచంద్రుడు. ప్రజలను సరైన మార్గములో నడిపించి వారి ఆదర్శములకు, వారి ఆనందములకు సరియైనటువంటి మార్గమును నిరూపింపచేసినవాడు శ్రీరామచంద్రుడు. ఏది చేసినా, ఏది చూసినా, ఏది పలికినా, ఏది అనుభవించినాకూడా ప్రజలయొక్క ఆనందమునకై ప్రాకులాడేటువంటివాడు.

ప్రజారాజ్యమే రామరాజ్యము. రాముడు ప్రజావాక్యమునకు చాలా ప్రాధాన్యము యిచ్చినట్లు తెలుస్తుంది. సీతను వనవాసమునకు పంపు ఘట్టము చూడగా అక్కడ పతిధర్మమునకు, రాజధర్మమునకు సంఘర్షణ యేర్పడింది. ఈ రెండింటిలో తాను, 'రాజధర్మము ముఖ్యమా లేక పతిధర్మము ముఖ్యమా?' అని విచారణ చేసి, రాజధర్మము ముఖ్యమనియు, పతిధర్మము కాదనియు తాను నిర్ణయం చేసుకున్నాడు. పతిధర్మము వ్యక్తికి సంబంధమైనది, రాజధర్మము సమిష్టికి సంబంధించినది. కనుక, రాజధర్మమునకు ప్రాధాన్యమిచ్చి, ఆ ధర్మమును పురస్కరించుకొని, సీతను వనవాసమునకు పంపినాడు. తరువాత, తన సింహాసనమున సీతకు అర్ధభాగమున్నట్లుగాను, సీత వనవాసమున తనకర్ధభాగమున్నట్లుగాను భావించుకున్నాడు. అర్ధాంగియైన సీత అరణ్యవాసములో ఉంటుండినప్పుడు, అర్ధస్వరూపమైన రామునకు మాత్రము అరణ్యవాసము కానేరదా! తాను శారీరకంగా అయోధ్యలో ఉంటున్నాడుగాని, మానసికంగా తానుకూడా అరణ్యవాసము చేస్తున్నాడు. దయా దాక్షిణ్యములు లేక నిండుచూలాలిని అరణ్యమునకు పంపించిన రామచంద్రునియొక్క చర్య, ప్రజలకు చాలా కష్టముగను, అధర్మముగను తోచింది. కాని, రామచంద్రుడు ధర్మమునకు విరుద్ధముగా ఏక్షణము కూడను నడిచేటువంటివాడు కాదు. అతడు పతిధర్మము, రాజధర్మమునకు వ్యత్యాసము గుర్తించే వర్తిస్తూ వచ్చాడు.

### *రాముడు సత్యధర్మస్వరూపుడు*

శ్రీరామచంద్రుడు సత్యమునే ఆధారముగా తీసుకొని, సత్యమునే పరమాత్ముని స్వరూపంగా విశ్వసించి, తన అధికారములోనున్న రాజ్యమును త్యజించి, పర రాజ్యమును ఆశింపక సత్యానికై పాటుపడుతూ వచ్చాడు. సత్యమనే పునాదిపైన ధర్మమనే గోడ కడుతూ వచ్చాడు శ్రీరామచంద్రుడు. దీనిని పురస్కరించుకొనియే 'సత్యాన్నాస్తి పరోధర్మః' అన్నారు. పునాది లేకుండా గోడకాని, గోడ లేకుండా పునాదిగాని ఉండదు. సత్యధర్మములనే రెండు పాదములుగా పెట్టుకొని, సత్యధర్మములనే రెండు రెక్కలుగా

ఉపయోగించి, సత్యధర్మములనే రెండు చక్రములుగా విశ్వసించి ఈ జగత్తులోపల, తాను సమాజములోను, అన్ని రంగములందు ధర్మతత్త్వాన్ని ప్రచారము గావింపచేశాడు. కనుకనే, రాముని, 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నారు. ధర్మమే సాక్షాత్ రామునిగా అవతరించిందని ఆ వాక్యమునకు అర్థము. రామస్వరూపము ధర్మము. అతని ప్రవర్తన సత్యము.

### ***పురుషార్థాల అవగాహన***

శ్రీరామచంద్రుడు ధర్మార్థకామమోక్షములను చతుర్విధ పురుషార్థములను రెండుగా మార్చుకుంటూ వచ్చాడు. ధర్మమును ఆధారం చేసుకొని, గమ్యమైన మోక్షమును ఆధేయంగా తీసుకున్నాడు. మోక్షమనునది పై అంతస్తు. అనగా పై మిద్దె. పై మిద్దె కెక్కుటకు నిచ్చెన కావాలి. మోక్షసౌధము నెక్కుటకు అర్థకామములు నిచ్చెన. ఆ నిచ్చెన నిల్చుటకు క్రింద ధర్మము అను భూమి ఆధారము. అర్థము, కామము అనునవి రెండును నిచ్చెన మెట్లు. ఆ మెట్లెక్కిపోతే మోక్షసౌధము చేరవచ్చును. అర్థము, కామము అను రెండును ధర్మముతోను మోక్షముతోను కూడినవేగాని ప్రత్యేకమైనవి కావు. దీనిని యింకా సులభంగా చెప్పాలనుకొన్నప్పుడు, ధర్మార్థములు రెండూ ఒక్కటైనాయి. మోక్షకామములు రెండూ ఒక్కటైనాయి. ధర్మార్థమనగా ధర్మముచేత అర్థమును నీవు సంపాయించు. అంతేకాకుండా ధర్మముకోసమై నీవు ధనము ఆశించు. నీవు లోకాన్ని కామించ వద్దు. మోక్షాన్ని నీవు కామించు. మన కామము మోక్షమునకు సంబంధించినదిగా ఉండాలి. మన సంపాదనంతా ధర్మమునకు సంబంధించినదిగా ఉండాలి.

రామాయణానికి మూలకారణం రెండే. మంథర క్రోధము, శూర్పణఖ కామము. ఈ కామక్రోధములే రామాయణానికి మూలకారణములుగా తయారైపోయినాయి. ఈ క్రోధము అయోధ్యలో ఉన్న రాముని అరణ్యానికి పంపించింది. కామము అడవిలో నున్న సీతను లంకకు పంపించింది. అనగా ప్రకృతి పరమాత్మల వియోగం సంభవించింది. ఈ వియోగంలో వచ్చిన బాధలే రామాయణంలో వచ్చిన మహాబాధలు. మంథర మనసు చాలా కఠినమైనది. మంథర అంటే కైకకు చాలా యిష్టము. ఎంత యిష్టమైనప్పటికీ కైక మొట్టమొదట అంగీకరించ లేదు.రాముని పట్టాభిషేకం జరుగబోతోందనే ఆనందంచేత, తన మెడలోనున్న హారమును తీసి మంథర మెడలో వేసింది. కాని, మంథర దానిని తీసి పారవేసింది. కోపం చాలా చెడ్డది. ఈ కారణము చేతనే పట్టాభిషేకమునకు సిద్ధముగానున్న రాముడు అరణ్యాలకు వెళ్లవలసి వచ్చింది. ఇక్కడ ఒక్క విషయం గుర్తించాలి. అనేకమంది జాతకాలని, ముహూర్తాలని, ఈ పిచ్చిపిచ్చి భావాలను పెట్టుకొని కొంతవరకు తబ్బిబ్బై పోతుంటారు. ఈ పట్టాభిషేకమునకు ఎవరు ముహూర్తం పెట్టింది? సాక్షాత్ బ్రహ్మర్షి వసిష్ఠులవారే! మరునాడు ఉదయం పట్టాభిషేకం. కాని, అదే సమయానికి అరణ్యానికి పోవలసి వచ్చింది. ఇది ముహూర్తముయొక్క తప్పా లేక ముహూర్తం పెట్టినవాని తప్పా? కాదు.. కాదు. ఇది కేవలం రామసంకల్పమే దీనికి మూలకారణం. ఇంకా దీని వెనుక కొంత చరిత్ర కూడా ఉన్నది. ఒకానొక సమయంలో కైకేయి వద్ద చాలా సన్నిహితంగానున్న సమయంలో రాముడు కైకతో చెబుతూ వచ్చాడు. 'దీనికి నీవు సిద్ధంగా ఉండాలి. రాక్షస సంహార నిమిత్తమై నేను అరణ్యాలకు పోవలసి వస్తుంది. కాని, నీకు కొన్ని అపకీర్తులు వస్తాయి. నీవు యేమాత్రం దానిని లక్ష్యము చేయవద్దు. నన్ను అరణ్యానికి పంపించే కోరిక నీవు కోరుకో. భరతునికి పట్టాభిషేకం కావాలని కోరుకో' అని రాముడే మొట్టమొదట కైకకు చెప్పాడు. ఇది ఏ రామాయణములో కూడా కనిపించదు. కైక చెడ్డది కానే కాదు. కైక చాలా మంచిది. రాముని ప్రాణ సమానముగా చూసుకొనేది. భరతునికంటె రాముడంటే కైకకు చాలా యిష్టం. కన్న కుమారుని కంటె పెంచిన కుమారుని మీద ప్రేమ అధికం.

### ***రామాయణంలో ధర్మసూక్ష్మాలు***

శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై, అరణ్యమునకు రథమునెక్కి వెడుతున్నాడు. దశరథుడు మహావిచారముతో బాధపడుతూ 'తిష్ఠ, తిష్ఠ' అని అరుస్తూ వస్తున్నాడు. దీనిని విన్నటువంటి సుమంతుడు, రథమును నిలపటమా లేక ముందుకు పోవటమా అనే దృష్టితో రామచంద్రుని చూచాడు. రామచంద్రుడు చెప్పాడు, ' యాహి, యాహి' 'బయలుదేరి వెళ్లు' అని అన్నాడు. ఇక్కడ కొంతమంది, కొన్ని రకములైన వాగ్వివాదములకు అవకాశము యిస్తూవచ్చారు. 'రామచంద్రుడు సత్యవాక్పరిపాలకుడు కదా! ఇక్కడ సత్యమును యేమాత్రము పాటించక, తండ్రి ఆజ్ఞను పాటించక, రథమును నిలపక వెళ్లిపోవుట, ధర్మవిరుద్ధమైన మార్గాన్ని అవలంబించటమే కదా!' అని కొంతమంది భావిస్తున్నారు. కేవలము ఆజ్ఞ మీరటము కాకుండా, కొంత అసత్యము ఆడినట్లుకూడను నిరూపిస్తూ వచ్చారు. ఎట్లనగా, కొంతదూరము వెళ్లిన తరువాత సుమంతుడు రామునితో, 'స్వామీ! నేను కూడను తమతో అరణ్యవాసముచేసియుండిన ఎంతయో ధన్యుడనై వుండెడివాడను. నేను రేపో ఎల్లుండో అయోధ్యకు వెళ్లవలసి వస్తుంది. అప్పుడు దశరథుడు, 'నేను రథమును ఆపమన్నాను. నీవు ఎందుకు ఆపలేదని అడిగినపుడు నేను యేమి జవాబు చెప్పాలి?' అని ప్రశ్నించాడు. 'నేను నీ మాట వినిపించుకోలేదు' అని చెప్పమన్నాడు రాముడు. 'అది అధర్మముకాదా?' అని అంటారు కొందరు. కాని, అది అధర్మము కాదు. అందులో యేమాత్రము అధర్మమనేది లేదు. దీనికి కారణములుంటున్నవి. రామచంద్రుడు అరణ్యమునకు వెళ్లక తప్పదు. వెళ్లుటకు ఎంత ఆలస్యము చేస్తే అంత ఎక్కువ దుఃఖము తల్లిదండ్రులకు కలిగించినవాడౌతాడు. ఇంతియే కాకుండా దీనికి మరొక కారణముకూడా ఉంటున్నాది. దశరథుడు కైకకు వరమును చక్రవర్తి స్థాయి యందు యిచ్చాడు. ఆ వరమును పూర్తిగావించుటకు చక్రవర్తి స్థానమందున్న దశరథుడే రాముని అరణ్యమునకు పంపినాడు. ఇప్పుడు, 'రామా! నిన్ను చూడవలె,

రథమును ఆపు, ఆపు' అని వచ్చే దశరథుడు చక్రవర్తి కాదు, తండ్రి మాత్రమే. ఇది తండ్రి కుమారులకు సంబంధించిన విషయముగాని రాజ్యమునకు, చక్రవర్తికి సంబంధించినది కాదు. రాజాజ్ఞను పాటించాలిగాని దశరథుని ఆజ్ఞను పాలించటములో యేమాత్రము అర్థము లేదు. కనుక, 'నేను రాజుయొక్క ఆజ్ఞను పాటిస్తానుగాని, రాజుకాని మీ ఆజ్ఞను వినింపించుకోలేదు' అని చెప్పమన్నాడు రాముడు.

దుస్సంగము వలన కలిగిన దోషము, ఆ దోషమును తొలగించి మన్నించిన క్షమాగుణము యొక్క మహత్వము తెలుపు ఘట్టమిది. సుగ్రీవునికి, రామునికి మైత్రి ఏర్పడింది. సీతాన్వేషణలో తోడ్పడుతానని సుగ్రీవుడు వాగ్దానం చేశాడు. వాలిని సంహరిస్తానని మాట యిచ్చాడు రాముడు. న్యాయంగా విచారిస్తే, సుగ్రీవునిలో ఎట్టి దోషమూ లేదు. దోషమంతా వాలిదే. అతడు సుగ్రీవుని అపార్థం చేసుకున్నాడు. అంతేకాకుండా, తన బిడ్డతో సమానమైన తమ్ముని భార్యను చెరపట్టాడు. అలాంటి దుర్మార్గుని శిక్షించవలసిందే. కనుకనే, వాలిని సంహరించి అతని రాజ్యాన్ని సుగ్రీవునికి అప్పగించాడు. అయితే రాముడు వాలిని చెట్టు చాటున నిల్చుని ఎందుకు చంపాలి, అతని ఎదురుగా పోయి ఎందుకు చంపకూడదు అని సామాన్యులు విమర్శిస్తారు. ప్రాకృత దృష్టి గలవారే యిలాంటి అపోహలకు గురియవుతుంటారు. భగవంతునికి అన్నీ తెలుసు. ఏ కార్యము ఎప్పుడు ఏవిధంగా జరగాలో అలాగే జరిగి తీరాలి. రాముడు చెట్టు చాటున దాగినది వాలికి భయపడి కాదు. దీనికి కొన్ని కారణములున్నాయి. మొదటిది ఏమంటే, వేటకై వెళ్ళిన వారు మృగములను చెట్టు చాటునుండియే చంపుతారు. వాలికూడా మృగమే కాబట్టి రాముడు అతనిని చెట్టు చాటునుండి చంపటం న్యాయమే. రెండవ కారణం యేమంటే, వాలికి ఒక వరమున్నది. ఎవరు వాలికి ఎదురుగా నిలిచి యుద్ధం చేస్తారో వారి శక్తిలో సగం వాలికి చేరుతుంది. రాముడు గనుక వాలికి ఎదురుగా నిలచి యుద్ధం చేస్తే తన శక్తిలో సగం వాలిలో చేరవచ్చు. అప్పుడు వాలిని జయించటానికి వీలుగాక పోవచ్చు. ఇంక మూడవ కారణం. వాలికూడా పరమ భక్తుడే. కనుక, అతనికి ఎదురుగా పోతే అతడు పరుగెత్తి వచ్చి రాముని పాదాలపైబడి, 'రామా! నన్ను రక్షించు' అని కోరవచ్చు. అప్పుడు సుగ్రీవునికిచ్చిన మాట ఏమైపోవాలి! ఇట్టి విషయాలను దృష్టి యందుంచు కొని రాముడు వాలిని చెట్టు చాటునుండి సంహరించాడు. ఈ సత్యాన్ని వాలి ప్రాణం విడువక పూర్వమే గుర్తించి, రామునికి నమస్కరించి, 'రామా! నీ చేతిలో మరణించటం నా అదృష్టం' అన్నాడు. వాలి పశ్చాత్తాపము గుర్తెరిగిన శ్రీరామచంద్రుడు, నీ అభీష్టమేమిటో కోరుకోమన్నాడు. వాలి, 'నాకు వేరు ఆశ యేమాత్రమూ లేదు. ఇంత వరకు నేను జీవించినందుకు, నేను యిన్ని దుర్గుణములతో, దురాలోచనలతో ప్రవర్తించినందుకు కట్టకడపటికి తమ హస్తముల ద్వారా నేను ప్రాణములను వదులుతున్నాను. ఇదే నాయొక్క పవిత్రత. ఇంతకన్న నాకు కావలసినది యేమియు లేదు' అన్నాడు. 'రామచంద్రా! ఇట్టి పవిత్రమైన అంత్యము అందరికీ ప్రాప్తిస్తుందా?' అని పశ్చాత్తాపముతో పాదములపైబడి ప్రార్థిస్తున్న సమయమందు, రాముడతని హృదయాన్ని గుర్తించి, కొఱత లేకుండా చేయాలను ఉద్దేశ్యముచేతను, అతడు పరమ శాంతితో పరమగతిని పొందాలనే సంకల్పము చేతను, అంగదుని పిలిపించి, వాలి చూచుచుండగనే అంగదునికి యువరాజ పట్టాభిషేకము, సుగ్రీవునికి సామ్రాజ్య పట్టాభిషేకము కట్టి, వాలికి ఆత్మశాంతి కలిగించాడు.

### *మంచితనమునకు మారు పేరు దైవము*

మంచితనమునకు మారుపేరు దైవము. భగవంతునియొక్క సంకల్పములు, పలుకుల, చర్యలు నిరంతరము నిర్మలమైనవే, నిశ్చలమైనవే, నిస్వార్థమైనవే. ఒకానొక సమయంలో విశ్వామిత్రుడు అరణ్య ప్రాంతముల గురించి రామలక్ష్మణులకు చక్కగా వివరిస్తూ ప్రయాణం సాగించాడు. మార్గమధ్యములో గౌతమ మహర్షి ఆశ్రమం చేరుకున్నారు. అక్కడే అహల్యా శాపవిమోచనం జరిగింది. మన పురాణాల్లో ఆమె రాయిగా మారిపోయిందని అన్నారు. అనేక సంవత్సరములు ఆవిధంగా ఒకే స్థానములో పడియుండటంచేత దుమ్ము, ధూళి చేరి ఆమె రాయిగా కనిపిస్తున్నాదేగాని, సజీవంగానే ఉంటున్నాది. ఇది శాపముయొక్క రహస్యము. సర్వజ్ఞుడైన రామునికి యిదంతా తెలుసు. కాని, ఏమీ తెలియనట్లుగా నటిస్తూ వచ్చాడు. అక్కడికి వెళ్ళేటప్పటికి, 'లక్ష్మణా! కొంత విశ్రాంతి తీసుకోటం మంచిది' అన్నాడు. విశ్వామిత్రుడుకూడా అంగీకరించాడు. రాముడు, ఆ రాయి దగ్గరకు పోతూ ఉన్నాడు. ఇంకా పాదముకూడా సోకలేదు. ఆ పాదము యొక్క వైబ్రేషన్ ప్రభావముతో తక్షణమే కదిలింది అహల్య. రాముని పాదములు గట్టిగా పట్టుకుంది. రాముడు ఆశ్చర్యపడినట్లుగా నటిస్తున్నాడు. ఆమె అహల్య అని రామునికి తెలుసు. కాని, తాను మానవునిగానే సంచరించాలని, దైవంగా సంచరించకూడదనే సంకల్పాన్ని దృఢం చేసుకున్నాడు. రాముడు భగవంతుడనే విషయం ఒక్క ఋషులకు తప్ప యింకెవ్వరికీ తెలియదు. వచ్చిన కార్యం జరిగేవరకు ఈ సత్యాన్ని అట్లే దాచుకోవాలని అనుకున్నారు. రాముడెందుకోసం వచ్చాడు? సాధు సంరక్షణార్థమై వచ్చాడు. సాధువులంటే ఎవరు? సన్యాసి వేషం వేసుకున్నటువంటివారా? కాదు. అందరియందు సాధుత్వమున్నది. దానిని సంరక్షించుట కోసమే అవతారములు వస్తుంటాయి. అహల్య అనేకవిధములుగా పరితాపం పొందుతూ తనను క్షమించమని, అనుగ్రహించమని రాముని ప్రార్థిస్తూ వచ్చింది. తపస్సుకై వెళ్ళిన గౌతమ మహర్షి కూడను ఆసమయానికి విచ్చేశాడు. గౌతమునకు తెలుసు శ్రీరాముడు సాక్షాత్తు నారాయణమూర్తి అని. 'స్వామీ! కారణము లేని కార్యము జరుగదు. విత్తనము లేక మొక్క మొలవదు. ఏది జరిగినా మన మంచికే జరుగుతుంది' అన్నాడు. భగవంతుడు మునిమానస సంచారి. సర్వత్రా తన

స్వరూపమే అయినప్పటికీ ఈ ప్రకృతికి ప్రబోధించే నిమిత్తమై యీవిధమైన నాటకము ఆడుతుంటాడు.

సుగ్రీవుడు తన ప్రమాణాలను మరచిపోయాడు. కొత్తగా లభించిన రాజభోగాలలో మునిగితేలుతున్నాడు. ఈ జగత్తుకు ఆధారం ధనం కాదు, ధర్మం అన్న విషయం విస్మరించాడు. అప్పుడు రాముడు అనంతుడనే సర్పాన్ని పురికొల్పి కోపంగా బుసకొట్టమన్నాడు. అంటే అనంతుని రూపమైన లక్ష్మణునితో సుగ్రీవుని కృతఘ్నతను గురించి చెప్పి క్రోధావేశం కలిగించాడు. కృతజ్ఞతలేని రాజూ, కృతఘ్నులైన ప్రజలూ ఇద్దరూ విలువలేనివారే. సుగ్రీవుడు భోగలాలసుడై కాలహరణం చేస్తున్నప్పుడు రామునికి కోపం రావటం అనేది నాటకంలో అంతర్నాటకం. తను ప్రేరేపించిన వెంటనే సుగ్రీవుడు సీతాన్వేషణకు బయలుదేరగలడని రామునికి తెలుసు. ఈ విశ్వమహానాటకంలో అవతారాలు అంతర్నాటకం ఆడిస్తారు. సీతకోసం రాముడు దుఃఖించాడని మీరనుకుంటున్నారు. చిన్న చీమకు మహాసముద్రపు లోతు ఎట్లా తెలుస్తుంది! చరిత్రలో అద్వితీయుడైన వీరుడు రాముడు. ఖరదూషణత్రిశిరుల నాయకత్వంలో వచ్చిన పద్నాలుగువేలమంది రాక్షసులను తాను ఒక్కడే సంహరించాడు. ప్రతి రాక్షసుడికీ తన పక్కనున్నవాడు రాముడుగా కనిపించాడు. కోపంతో చెలరేగి ఒకరినొకరు సంహరించుకున్నారు.

అవతారమూర్తులు మానవుల మాదిరి ప్రవర్తించి మనషులలో ఈయనా మనలాటివాడే అనే భావం కలిగిస్తారు. మానవాతీత శక్తులు ప్రదర్శించటం ద్వారా అటువంటి ఉన్నతస్థాయిని చేరుకోవాలనే ఆకాంక్షను మనుషులలో కలిగిస్తారు. నరతత్త్వమును నారాయణతత్త్వముగా పరిణమింపజేయవచ్చును. అవతార పురుషుని జీవితమందలి ప్రతి సన్నివేశమూ ముందుగా నిర్ణీతమైన ప్రకారంగా నడుస్తుంది. శూర్పణఖ వచ్చిన తరువాత రావణుడు వస్తాడని రాముడు గుర్తించాడు. సీత నిజరూపమును అగ్నిలో భద్రపరచి బాహ్యారూపముతో సంచరించవలసినదని ఆదేశించాడు. మానవరూపం ధరించుటకు మునుపే శక్తిస్వరూపిణి కూడా తనవెంట రావలెనని రామునకు తెలుసు. దేవతలనుండి రావణుడు సంపాదించిన వరములు నిరర్థకములు కావలెనంటే అతడేదైనా మహాపాపం చేయాలి. సీతాదేవికి అగ్నిప్రవేశమనేది కఠిన కరీక్ష కానేకాదు. లంకలో ప్రవేశించుటకు పూర్వమే అగ్నిలో భద్రపరచిన సీతాదేవి నిజస్వరూపం వెలుపలికి తెచ్చుటకు అగ్నిపరీక్షను ఏర్పాటు చేశాడు. అవతారపురుషులు అనుసరించే విధానం అటువంటిది. వారు తమ తత్త్వములు చర్యలలో నిరూపించుతారు. బల్ల కట్టుకొని చాటుకోరు. రాముని వనవాసానికి పంపదలచినప్పుడు కైకేయి ఈ కష్టాన్ని వూహించలేకపోయింది. ఋష్యాశ్రమంలో వున్న సీతారామలక్ష్మణులను అయోధ్యకు తిరిగి రావలసిందని తన పుత్రుడు బ్రతిమాలుకుంటున్న సందర్భంలో కైకేయి తాను చేసిన పని ఎంత బాధాకరమైనదో గ్రహించగలిగింది. కాని, రాముడు రాళ్ల వల్లా, ముళ్లవల్లా ఎటువంటి బాధ పడలేదు. ఋషులలో విశ్వాసాన్ని పెంచటానికీ, వాళ్ల భయాలు త్రుంచటానికి రాముడే వనవాసాన్ని స్వయంగా ఏర్పరచుకొన్నాడు. నిజం చెప్పాలంటే భక్తుల మార్గంలో వున్న అవరోధాలు తొలగించుటే ఆ పాదాల ప్రయోజనము.

### *శ్రీరాముడు పతితపావనుడు*

శ్రీరాముడు పతితపావనుడు. రామాయణంలో ఎవరీ పతితులు? శ్రీరాముడు ఏరీతిగా వారిని పావనం చేశాడు? మొట్టమొదటిది శబరి. ఈమె ఎట్టి ఆధారము ఎట్టి దిక్కు లేనిది. ఎట్టి సామర్థ్యాలను తాను కలిగియుండలేదు. తాను అనేక విధములైన పాపములకు గురియై గురువాజ్ఞను పురస్కరించుకొని శ్రీరామచంద్రుడే తనకు దిక్కుగా భావించి అతని రాకకై ఎదురుచూస్తూ ఉండినది. తాను సర్వకాల సర్వావస్థలయందు రామచింతనయందే మునిగి ఉండినది. ఒకనాడు మతంగమహర్షి శబరిని ఉద్దేశించి, ' శబరీ! శ్రీమన్నారాయణుడు రామావతారమెత్తి, తన తండ్రి ఆజ్ఞను పురస్కరించుకొని తాపస వేషము బూని అరణ్యములో సంచరిస్తున్నాడు. అతడు ఆజానుబాహుడు. అలాంటి పవిత్రమూర్తి మన ఆశ్రమానికి వస్తాడు. ఆ సమయమునకు నేను ఇక్కడ ఉండను. కనుక, నీవు భక్తిపూర్వకంగా అతనికి స్వాగతము పలికి సత్కరించుము' అని బోధించాడు. ఆనాటినుండి శ్రీరామచంద్రుడు తన ఆశ్రమానికి ఏ క్షణాన వస్తాడోనని శబరి నిరంతరం అనేకవిధాలుగా సిద్ధమై ఉండేది. రాముడు తాపస వేషము ధరించి అరణ్యములో సంచరిస్తున్నాడని.

సీత బంగరు లేడిని చూసి మోసపోయింది. అటువంటి మాయా మృగాన్ని చూసి సీత యెందుకు వ్యామోహపడాలి? అటువంటి అసాధారణ జంతువున్నదని రాముడు ఎందుకు నమ్మాలి? అది రాక్షసుల పన్నాగమని సీతకు నచ్చ చెప్పి ఉండవలసింది రాముడు. ఆవిధంగా తమ దృష్టిని ఆకర్షించి విపత్తు తెచ్చి పెట్టటానికి రాక్షసుల ఎత్తుగడ అని చెప్పవలసింది అని అనుకుంటారు మీరు. అందరు భర్తలలాగే రాముడు కూడా భార్యా వ్యామోహంలో పడి ఆవిడ మాట కాదనలేకపోయాడా! ప్రాణాలతో ఆ బంగారు లేడిని పట్టి తెచ్చి పెంచుకోటానికి యిస్తానని రాముడు దాని వెంట పడ్డాడు. ఆయన సామాన్య భర్త అయితే ఈ వ్యామోహం ప్రమాదానికి దారితీసేది. కానీ, ఆయన భగవంతుడు కనుక, మరొకవిధంగా ఆలోచించాలి. అన్ని సంఘటనలూ ఆయన సంకల్పానుసారం జరుగుతాయి.

రామలక్ష్మణులు యిరువురూ రామేశ్వరం వెడుతున్నారు. రామేశ్వరంలో రామలింగేశ్వరుని ప్రతిష్టించాలని సంకల్పించుకున్నారు. ఏదో ఒకరీతిలో జగత్తంతా నామస్మరణ చేయాలనే సంకల్పముతో రామేశ్వరములో శివలింగమును

ప్రతిష్టించాలని తలచాడు. హనుమంతునికి రామా అంటే తప్ప యింకేమి యిష్టములేదు. 'ఎద్దునెక్కినా గద్దనెక్కినా యిద్దరొక్కటే రన్నా!' ఈసత్యమును రాముడు ఎప్పుడూ బోధిస్తు వచ్చాడు. కాని, రామునిపై నున్న ప్రేమ యింకొకరిపై లేదతనికి. హనుమంతునే పంపాడు. ఎవరు వద్దంటున్నారో వారిచేతనే ఆ పని చేయిస్తాడు. 'హనుమా! నీవు ఫలాని పర్వతముపైకి వెళ్ళి ఒక లింగమును తీసుకొనిరా. ప్రతిష్ట చేయాలన్నాడు. అతను అంత ఉత్సాహము చూపించ లేదు. ఫలాని టైము లోపలనే చేయాలి. తీసుకొనిరా' అన్నాడు. వెళ్ళాడు, తీసుకొని వచ్చాడు. ఎక్కడ శ్రద్ధ ఉంటుందో అక్కడ జ్ఞానం ఉంటుంది. శ్రద్ధ లేనప్పుడు జ్ఞానము కూడా పనిచేయదు. రాముడు చెప్పిన కాలమునకు పది నిముషములు ఆలస్యముగా వచ్చాడు. రాముడు ఆలోపలనే యిసుక లింగము చేసి ప్రతిష్టించాడు. పది నిముషములు ఆలస్యమైందని ఆ లింగము వద్దన్నాడు. హనుమంతునికి బాగా కోపం వచ్చింది. నేను యింత కష్టపడి తెచ్చిన లింగము వద్దని అంటున్నాడు. అప్పుడే రామునిపై కోపం వచ్చింది. భక్తిలోకూడా ఒకవిధమైన అహంకారము బయలుదేరుతుంది. ఏమిటి నాలో భక్తి తక్కువా అని నిజము తేల్చుకోటనికి కూర్చున్నాడు. నిర్ణయమయ్యేవరకు మనస్సు శాంతించదు. నాలో భక్తి ఉన్నది. ఒక్కొక్క వంట్రుక పెరికి చూచాడు. రోమరోమము రామనామము పలికింది. నాలో భక్తి ఉందని తనకు తాను సంతృప్తి చెందాడు. శ్రీరాముడు హనుమంతుని పరీక్ష చేయాలి. భగవంతునికి పరీక్ష అనేది ఒక ఆట. భక్తుని పరీక్ష చేసినప్పుడే అతనికి ఆనందము. వస్తూవస్తూ కాలికి యేదో తగిలి క్రింద పడినట్లుగా పడ్డాడు రాముడు. అక్కడ ఒక చిన్న రాయి తగులుకొని క్రింద పడినట్లు నటించాడు. వెనకనే ఉంటున్నాడు లక్ష్మణుడు. ' అన్నా! ఏమిటద'ని ప్రశ్నించాడు. 'ఏమీ లేదు చిన్న రాయి' అన్నాడు. హనుమంతుడు వచ్చాడు. 'ఈ దారిలో యింకెవరైనా వస్తే వారికి తొందరఅవుతుంది' అని ఈ రాయిని 'పెరికి పారవేస్తాను' అన్నాడు. 'హనుమంతా! కొండలు మోసిన వారికి ఈ గులకరాయి నాకెంత? విడిచిపెట్టు. దాని జోలికి నీవు పోవద్దు. ఇంకొక పర్యాయము నేను జాగ్రత్తగానే వస్తాను. రాయి దోషం కాదు' అన్నాడు. 'లేదు దీనిని తీసివేయాల' ని పట్టుపట్టాడు. అది జన్మ వాసన. చంచలత్వమునకు పుట్టిన యిల్లు, పెట్టిన పేరు. ఎడమ చేతితో తీసివేయుటకు ప్రయత్నించాడు. కదలలేదు. తరువాత రెండు చేతులతో పట్టాడు. కదల లేదు. తన శక్తినంతా ఉపయోగ పెట్టాడు. కించిత్తైనా అది కదల లేదు. హనుమంతుడు చాలా ఆశ్చర్యపడ్డాడు. రామా! ఏమి నీ లీలలు! ' ఏమీ లేదు హనుమా! నీవు శ్రమ పడనక్కరలేదు' అని, రాముడే తన కాలి చిటికిన వేలుతో అట్లా అన్నాడు. ఎగిరి పడిపోయింది. ఏదది? హనుమంతుడు తెచ్చి పారవేసిన లింగము. ఆ లింగము నుంచి జ్యోతి వచ్చి రామునిలో చేరిపోయింది. రాముని నుంచి జ్యోతి పోయి లింగములో చేరిపోయింది. రెండూ ఒక్కటే! ఎద్దు నేక్కిన వాడు లింగడు. గద్ద నెక్కినవాడు రంగడు. ఇద్దరూ ఒక్కటే అనే సత్యమును గుర్తించమని బోధించాడు.

**కృతజ్ఞత**

రాముడు కృతజ్ఞుడు. ఇతరులు చేసిన మేలు మరచిపోవు వారు కృతఘ్నులు. కాని, రామునియొక్క తత్త్వము అలాంటిది కాదు. ఇతరులు చేసిన చిన్న మేలునుకూడను ఘనముగా భావించటము, తాను చేసిన ఘనకార్యమును కూడను చిన్నదిగా భావించటము రామునియొక్క తత్త్వము. సుగ్రీవుడు చేసిన మేలు మరువక అతనికి పట్టాభిషేకము ప్రత్యుపకారముగా చేశాడు. విభీషణునికి యిచ్చిన మాట దక్కించే నిమిత్తము, అతడు తనకు చేసిన సహాయము మరువక అతనికి పట్టాభిషేకము గావించాడు. ఇంతమాత్రమే కాదు. తన జీవిత పర్యంతము విభీషణ, సుగ్రీవులను తన సోదరులుగా భావించుకుంటూ వచ్చాడు.

హనుమంతుడు చేసిన సహాయమునకు, అతను పడిన శ్రమలకు మెచ్చి, 'హనుమంతా! నేను నీకేమి యివ్వగలను? నీకు కృతజ్ఞత చెప్పటంతప్ప ప్రతిఫలమును అందించలేను. ఐతే నీ జీవితంలో ఎప్పుడు నన్ను స్మరించినప్పటికి అప్పుడు వచ్చి దర్శనమిస్తాను' అని అన్నాడు. హనుమంతుడు చేసిన సహాయమునకు కృతజ్ఞతగా ఈ ప్రతిఫలము అందించాడు రాముడు. అనగా ఎవరినుండి మనం సహాయం పొందెదమో అట్టి వారికి జీవితమంతయు కృతజ్ఞత చూపటం మన ప్రధాన కర్తవ్యం.

శ్రీరాముని మించిన ఆదర్శ మిత్రుడు మరొకడు లేదు. ఈనాడు నీ జేబులో డబ్బు అధికంగా వున్నప్పుడు, నీవు మంచి అధికార హోదా కల్గియున్నప్పుడు అందరూ 'హలో...హలో...' అంటూ నీకు మిత్రులౌతుంటారు. కాని, అధికారమును, ధనమును కోల్పోయిన తరువాత ఒక్క మిత్రుడు కూడా నీ సమీపానికి రాడు. కాని, రాముడు అటువంటి మిత్రుడు కాడు. కష్టములందైనా, సుఖములందైనా తన మిత్రుని సమంగా ఆదరించి ఆప్యాయంగా ప్రేమించిన వాడు. గుహుడు చాలా బీదవాడు. అతడు పడవ నడిపేవాడు. అట్టివాని మిత్రత్వాన్ని రాముడు చక్కగా వర్ణిస్తూ, 'నీవు నీ నాల్గవ తమ్ముడవు' అని అన్నాడు. ఈవిధంగానే ఎవరు తనను ఆశ్రయించారో, ఎవరు తనను ప్రేమించారో, ఎవరు తనకు శరణాగతులైనారో వారందరినీ తన మిత్రులుగా ఆదరించి వారికి తగిన శక్తి సామర్థ్యములను చేకూర్చుతూ వచ్చాడు శ్రీరాముడు.

### *ధృఢసంకల్పము*

రామునిలో మరొక గొప్ప గుణము దృఢసంకల్పము. తండ్రి మాటను పాటించే నిమిత్తమై తాపస రూపము ధరించి, అరణ్యములో పదునాలుగు సంవత్సరములు ఆ మహావ్రతమును పాటిస్తూ వచ్చాడు. ఇంతేకాదు ఆ పదునాలుగు సంవత్సరములు అరణ్యమునందు సంచరించుటకు దీక్షను వహించెను. రావణవధ జరిగింది. రాముడు సుగ్రీవుని, లక్ష్మణుని పిలిచి విభీషణుని లంకారాజ్య పట్టాభిషేకం చేయవలసిందన్నాడు. ఆశుభసమయంలో రాముడే స్వయంగా లంకానగరానికి వచ్చి తనను దీవించవలెనని విభీషణుడు వేడుకున్నాడు. తన వనవాస దీక్షకు భంగం కలుగునని లంకానగర ప్రవేశం చేయజాలనని రాముడు చెప్పాడు.

### *భూతదయ*

రామునియందున్న ప్రత్యేక లక్షణము భూతదయ. ఎట్టి జీవినైననూ ప్రేమించి, ఆదరించి, దయచూపేటువంటిది రామతత్త్వము. తనకు అపకారము చేసిన వారిని, తనకు కీడు చేసిన వారిని కూడను ప్రేమించి, ఆదరించి వారి మంచినే కోరేటువంటిది రామతత్త్వము. ఒకానొక సమయంలో భరతుడు తల్లియైన కైకను దూషింపగా రాముడు మాతృదూషణ మహాపాపమని భరతుని చర్యను ఖండించాడు. ఇంతియేకాదు, రావణ వధానంతరము ఒకానొక సమయంలో తన తండ్రియైన దశరథుని దర్శించాడు. ఆ సమయమందు ధశరథుడు ఆనందము పట్టలేక, 'నీకు ఏమి కావలయునో కోరుకో' అని ఆజ్ఞాపించాడు. అప్పుడు రాముడు, ' తండ్రీ! మీరు ఈవిధముగా దర్శనము యివ్వటము నాకు చాలా ఆనందముగా ఉంది. మాతృమూర్తియైన కైకను క్షమించి, భరతుని క్షమించి ఆదరించి వారికి మీరిచ్చియున్న శాపములను ఉపసంహరింతురేని నేను యింకనూ ఆనందింతును. ఇదియే నాకు కావలసినది' అన్నాడు. రాముని అరణ్యమునకు పంపే సమయమున దశరథుడు పట్టలేని దుఃఖముతో, క్రోధముతో, 'కైకా! నీకు నరక ప్రాప్తి చేకూరునుగాక! నీ కుమారుని చేతి పిండమును నేను అందుకోను' అని అన్నాడు. ఆవిధమైన మాటలను ఉపసంహరించు కోవాలని రాముడు తండ్రిని ప్రార్థించాడు.

### *శరణాగత పాలన*

యుద్ధసమయమందు సముద్రతీరమున రామ లక్ష్మణ సుగ్రీవ అంగద జాంబవంత హనుమంతాదులందరూ చేరి ముందు జరుగవలసిన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లూ గావిస్తుండగా విభీషణుడు దూరమునుంచే, 'రామచంద్రా! శరణాగతుడను, శరణాగతుడను' అని అరుస్తూ వస్తున్నాడు. 'శరణాగతుడను' అన్న మాట వినబడగానే, రామచంద్రునికి విభీషణునియెడ అనుగ్రహము కలిగినది. కలిగిననూ రాజనీతి చక్కగా ఎరిగినవాడు కనుక, ఈ విషయమున తన పరివారముయొక్క అభిప్రాయమెట్లుండునో తెలుసుకొనుట మంచిదనుకొని, 'అతనిని మనము అంగీకరింపవచ్చునా?' అని సుగ్రీవుణ్ణి, అంగదుణ్ణి, జాంబవంతుని వీళ్ళందరిని ప్రశ్నించాడు. వారందరూ, 'వాడు మన శత్రువుయొక్క తమ్ముడు. కనుక, ఎంతమాత్రము అంగీకరింపరాదు' అన్నారు. వెంటనే రాముడు, వా దెవడైనా సరే, ఎట్టి వారైన కూడను పరవా లేదు. శరణుజొచ్చిన వారిని రక్షించటమే నా కర్తవ్యము. 'నీవాడని ఒక పరియన ఏవాడైనను ఏలుదు వానిన్' అని వారందరికీ తెలుపుతూ వచ్చాడు. అప్పుడు సుగ్రీవుడు అన్నాడు, ' స్వామీ! ఇదేవిధముగా రేపటి దినము రావణుడే వచ్చి నేను నీకు శరణాగతుడనని ప్రార్థిస్తే, నేను నీవాడనే అని మొరపెడితే అతనిని ఏ రీతిగా క్షమించగలరు? ఏ రీతిగా రక్షించగలరు?' 'రావణునికి అంత ఉత్తమ భావమే కలిగితే, నేను అతనిని అయోధ్యకే రాజుని చేస్తాను' అన్నాడు రామచంద్రుడు. శరణాగతి తత్త్వము చక్కగా అర్థము చేసుకోవాలి. పగవాడైననూ 'శరణు' అంటే భగవంతుడు తప్పక రక్షిస్తాడన్న పరమార్థము గ్రహించాలి. విభీషణుని పిలచి జరిగినదంతా వివరించమన్నాడు. అప్పుడు విభీషణుడు వివరిస్తూ రావణుని అధర్మ ప్రవర్తనకు అడ్డు తగిలి అనేకమంది సలహాలు చెప్పినప్పటికీ వినిపించుకోకుండా, అక్రమమైన మార్గంలో, అధర్మమైన రీతిలో సంచరిస్తూ వస్తున్నాడు. ఇది రాజుకు తగిన లక్షణము కాదని కేవలం అల్పులకు తగిన బుద్ధులని, అల్పబుద్ధులు పెట్టుకొని రాజ్యమేలటం రాజ్యమునకే శ్రేయస్కరం కాదని చెప్పాను. రావణునికి కోపం వచ్చింది. ఇంద్రజిత్తుకు కూడా కోపం వచ్చింది. ఇలాంటి సోదర ద్రోహి, రాజ్య ద్రోహి ఈ లంకలో ఉండటానికి వీలుకాదు. బయటకు వెళ్ళమన్నారు. ఇదీ నా మంచికేనని భావించి, తక్షణమే యిక్కడికి వచ్చాను. కనుక, నాకు యింక లంకతో సంబంధం లేదు. నాకు కావలసింది భగవంతుడే. భగవంతుని పాదసన్నిధినే చేరి నా జీవితమును సార్థకం గావించుకోవాలని సంకల్పించుకున్నాను. నేను ఏనాటినుండియో రామనామాన్ని స్మరిస్తూ వస్తున్నాను. మొట్టమొదట హనుమంతుడు లంకలో ప్రవేశించినప్పుడు, అతనికి నాకు కలిగిన సంబంధబాంధవ్యము ఈ రామభక్తి ప్రభావము వలనే, ఆనాడుకూడను రామభక్తి ప్రభావమునే ముచ్చటించుకున్నాము. ఈ విషయాన్ని హనుమంతుడు కూడా అంగీకరించాడు. ' నీ పాదములు తప్ప నాకు అన్యము అవసరము లేదు. ఆలుబిడ్డలుకూడా నాకు అవసరం లేదు. నాకు కావల్సింది నీ పాద సన్నిధియే, నీ సేవాభాగ్యమే నాకు నిజమైన భాగ్యము. ఇటువంటి ఘనమైన భాగ్యము నాకుండగా, ఈ అల్పమైన ఆశలకు నేనెందుకు తల ఒగ్గాలి?' అని విభీషణుడు చెప్పగా, అప్పుడు రాముడు దగ్గరకు పిలచి, 'విభీషణా! నీవు భయపడవద్దు. నీ సోదరుడు చేసిన క్రూరమైన చర్యలకు తగిన శాస్తి త్వరలోనే అనుభవించబోతున్నాడు. దీనిని నీవే కళ్ళారా చూడగలవు. నిన్నే ఆ లంకకు రాజుగా చేయగలను' అని లక్ష్మణుని, సుగ్రీవుని వెంటబెట్టుకొని విభీషణుని సముద్రము వద్దకు తీసుకొనివెళ్ళి సముద్ర జలము తెప్పించి, లంకా రాజ్యమునకు

విభీషణుని రాజుగా అభిషిక్తుని గావించినాడు. అప్పుడు విభీషణుడు ప్రార్థించాడు, 'స్వామీ! నేను రాజ్య అభిమానంతో రాలేదు. నాకు ఏ రాజ్యము అవసరం లేదు. రామనామ సామ్రాజ్యమే నాయొక్క రాజ్యము. ఆ రాజ్యములో నన్నొక దూతగా విశ్వసించండి. ఆ రాజ్యములో నేనొక సేవకునిగా ఉంటాను' అన్నాడు. రాముడు అనుగ్రహించాడు.

యుద్ధంలో ఇంద్రజిత్తు మరణించగా రావణుడు తన కుడి భుజము పోయినంతగా చింతించాడు. ఇంద్రుని జయించినవాడు కనుక రావణుని కుమారునికి ఇంద్రజిత్తు అని పేరు వచ్చింది. అట్టి మహావీరుని మరణం రావణునికి తీరని బాధ కలిగించింది. కుంభకర్ణుడు, ముఖ్యమైన యితర సైన్యాధిపతులు కూడా మరణించారు. ఇంకమిగిలినది రావణుడు మాత్రమే. అయితే రాముడు దేవుడై కూడా ఈవిధంగా జీవులను హింసించటం న్యాయమా అని మీరు ప్రశ్నించవచ్చు. సృష్టించుటకు అధికారమున్నవానికి శిక్షించుటకు కూడా అధికారమున్నది. అసలు రక్షించేది, శిక్షించేది దైవము కాదు. ఎవరి సద్గుణములు వారిని రక్షిస్తాయి, ఎవరి దుర్గుణములు వారిని శిక్షిస్తాయి. లోకంలో ప్రతి కర్మకు ఒక ఫలితము ఉంటుంది. ఫలానా దోషమునకు ఫలానా శిక్ష అని ఒక నియమమున్నది. కాని, కొందరు దుర్మార్గులు చేయరాని పనులు చేసి, తమకెట్టి దుష్ఫలితములూ లభించలేదని అహంకారముతో విఱ్ఱవీగుతుంటారు. తగిన సమయం రావాలేగాని కర్మలకు ఫలితము ఏనాటికీ తప్పదు. కాలము పండాలి. అప్పుడే ఫలితము అందుతుంది.

**రాముని క్షమాగుణం**

యుద్ధసమయములో రావణుని సైనికులు కొంతమంది రహస్యములను తెలుసుకోవాలని వానరులతో చేరి, మారువేషములలో సంచరించు సమయమందు విభీషణుడు వారిని పట్టినాడు. ఆ సమయములో సుగ్రీవాదులు వారిని హింసించుచుండగా, వారు రాముని శరణాగతి పొంది,'రామా! మమ్ము రక్షించుమ'ని కోరినప్పుడు రాముడు క్షమించి వదలినాడు. రాజదూతలను హింసించుట సరైన రాజనీతి కాదని విభీషణాదులకు బోధించాడు. నాల్గవ దినమున రాముడే యుద్ధానికి బయలుదేరాడు. మహాఘోరమైన యుద్ధము జరిగింది. అటువైపు, ఇటువైపు అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. ఆనాడు రాముడు ప్రయోగించిన అస్త్రములచేత రావణుడు బాగా అలసినట్లు కనిపించాడు. ఇలాంటి సమయములో శత్రువునైనా చంపకూడదు. బలహీనుని, అలసిపోయినవానిని చంపటం గొప్పతనం కాదు. శత్రువు సరిసమానమైన శక్తిసామర్థ్యములతో ఉన్నప్పుడే అతనితో యుద్ధం చేయాలి. రాముడు దయాహృదయుడు, ప్రేమస్వరూపుడు. రాముడు అస్త్రశస్త్రములను క్రింద పెట్టి, 'రావణా! నీవు అలసినట్లు కనిపిస్తున్నావు. నీవు యుద్ధం చేయటానికి ఇది సరియైన సమయం కాదు. నీ గృహమునకు వెళ్ళి విశ్రాంతి తీసుకొని రేపటి దినము తిరిగి రా' అన్నాడు. ఎవరైనా శత్రువుతో ఈరీతిగా చెబుతారా? యుద్ధంలోకూడా ధర్మం తప్పలేదు శ్రీరాముడు.

శ్రీరాముడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడుకదా! మరి తానుకూడా ఎందుకు ఇన్ని కష్టాలను అనుభవించవలసి వచ్చింది అని ప్రశ్నించవచ్చు. భగవంతుడైనా శరీరము ధరించిన తరువాత ప్రవృత్తి ధర్మాన్నే అనుసరించాలి. అవతారపురుషులు కొన్ని సమయములందు మాత్రమే తమ దైవత్వాన్ని వెల్లడిచేస్తారుగాని, మిగిలిన అన్ని సమయములందు మానవత్వంయొక్క ప్రవృత్తినే ప్రకటిస్తుంటారు. రాముడు మానవాకారము ధరించినప్పటికీ తాను మానవుడు కాదనే సత్యము తనకు తెలుసు. అయితే శారీరకంగా లోకానికి ఆదర్శమునందించే నిమిత్తమై తానుకూడా సామాన్య మానవునివలె మాయచేత కప్పబడినట్లు, భార్యావియోగంతో కుమిలిపోయినట్లు, యుద్ధము చేసి విజయాన్ని సాధించినట్లు నటిస్తూ వచ్చాడు. సత్యాసత్యములకు, ధర్మాధర్మములకు మధ్య జరిగిన సంఘర్షణే రామరావణయుద్ధం.

దశరథుడు కూడా సీత పవిత్రతకు మూర్తీభావమని రామునికి నచ్చజెప్పాలనీ, తన కొడుకును కళ్లారాచూచుకోవాలని పితృహృదయం పొందే ఆరాటం తీర్చుకోవాలనీ వచ్చాడు. పితృవాక్యపరిపాలనలో రాముడు చాటిన దీక్షను ఆయన మెచ్చుకున్నాడు. యుద్ధంలో మరణించిన వానరసైనికులందరూ రణరంగంలో పునరుజ్జీవితులై రామునిచుట్టూ చేరటంకూడా ఆయన చూశాడు. అప్పటికే రాక్షసులందరికీ మోక్షం లభించింది. చివరి శ్వాస విడిచేటప్పుడు వారందరికీ దైవదర్శనం లభించింది. 'నా పరికరాలుగా వినియోగపడుటకు వానరులు జన్మించారు. కనుక, వారికి మరణం లేదు. నా ఆజ్ఞానుసారమే వారికి జననం' అన్నాడు రాముడు.

సీతను పల్లకీలో తన స్థావరానికి తోడ్కొని రావలసిందని హనుమంతుని పంపినాడు. తన పనులలో మునిగియున్న విభీషణుడు సీత సంగతి ఆలోచించలేదు. సీతాదేవికి హనుమంతుడు ప్రణామం చేశాడు. సీత సముద్రం నుంచి ప్రభవించిన లక్ష్మీదేవిగా గోచరించింది. తన జన్మపరంపరలు క్షణంసేపు లభించిన ఆ దివ్యదర్శనము వల్ల ధన్యమైనట్లు హనుమంతుడు భావించాడు. అది తన అనేక జన్మలను సార్థకం చేయగల పరిహారంగా తలచినాడు. రాముని స్థావరం చేరుకుంటున్న ఆ పల్లకీలోనుంచి ఒక మహా తేజస్సు నలుదిక్కులా వ్యాపించింది. అది గమనించిన వానరయోధులు ఆశ్చర్యచకితు లైనారు. అల్లంత దూరాన పల్లకీ దిగి నడిచి రమ్మని రాముడు కబురు పంపెను. ఆమె దివ్యతేజస్సును తనివితీరా వానర వీరులు చూడవలెనని, కన్ను పండువ చేసుకోవలెనని రాముని తలంపు. ఈవిషయము మీకు ఏ గ్రంథములోనూ కనబడదు.

సీత పదిగజాలదూరంలో ఉండగా రాముడు, 'నేను సీతను చూడను. నేను లోకోద్ధరణ నిమిత్తమై జన్మించాను. లోకానికి

ఆదర్శాన్ని నిరూపించాలి. పదినెలలు లంకలో ఉన్న సీతను తెచ్చుకున్నాడని లోకులు నన్ను నిందిస్తారు. అగ్ని పరీక్షకు గురియైన తరువాతగానీ స్వీకరించను' అన్నాడు. ఆయన కరిగినప్పుడు వెన్న, కఠినత్వం వహించినప్పుడు ఉక్కు. పిడుగుపాటువంటి ఈ మాటలకు లక్ష్మణుడు మూర్ఛపోయాడు. చితి పేర్పించమని లక్ష్మణునితో చెప్పాడు రాముడు. చితి పేర్చుటకు కట్టెలు తెచ్చే వానరులు పుల్లల బరువుకే కృంగిపోయారు. సీత అగ్నిలో ప్రవేశించాలి, అగ్నిదేవుడు మెచ్చుకోవాలి. అప్పుడే నేను ఈ సీతను అయోధ్యకు తీసుకొని వెళ్తానని చెప్పాడు. రాముడు అంతవరకు ఈమెతో అయోధ్యకు పోనన్నాడు. ఆ మాటలు వినేటప్పటికి లక్ష్మణుడుకూడా మండిపోయాడు. ఏనాడుకూడను రాముని ఎదురు పలికి ఎరుగని లక్ష్మణుడు, 'రామా! నీకేమైనా మతి భ్రమించిందా! సీతాదేవి మహాసాధ్వీమణి 'స్త్రీ' అని అంత చులకనగా మాట్లాడుతున్నావా? ఆవిధంగా వశమయ్యేటటువంటిదైతే పది నెలలు ఎందుకు ఈ కష్టాలు అనుభవించాలి? అంతమాత్రం నీవు తెలుసుకోలేకపోయావా? గొప్పవారికికూడా అప్పుడప్పుడు ఇంగితజ్ఞానం లేకుండా పోతుంది' అని లక్ష్మణుడు చెప్పేటప్పటికి, 'లక్ష్మణా! మనం ఆదర్శమానవులుగా బ్రతుకుతున్నాం. ఆదర్శాన్ని కూడను నిరూపించాలి, చూపించాలి. ఆమె గొప్పతనం నాకు తెలుసు. అయితే గొప్పతనంలో కూడను మంచితనం నిరూపించాలి. వీడు గొప్పవాడు, వీడు మంచివాడు అంటారు. గొప్పవాడికంటె మంచివాడే గొప్పవాడు. కనుక, ఈమె గొప్పదే, మంచిదనికూడా నిరూపించాలి' అని చెప్పేటప్పటికి సీత కంటిధారలు కార్చుకుంటూ ఆ చితికి ప్రదక్షిణ చేసి, 'నేను నిజముగా సత్యస్వరూపమే అయితే, నాలో ఎట్టి దుర్భావములు లేకపోతే, ఈ అగ్ని చల్లారుగాక!' అని ఒక్కతూరి అగ్నిలో దూకింది. అగ్నిపరీక్ష రెండు ప్రయోజనాలు సాధించింది. అన్ని కాలలలో అవతారపురుషులను అపనిందల పాలుచేసే నాలుకలు వెన్నంటి పీడిస్తవి. వాటిని కాల్చివేసింది. రావణుడు అపహరించుటకు మునుపు అగ్ని ప్రవేశంచేసిన సీతనే అగ్ని పునరుద్ధరించింది.

అందరూ పుష్పకవిమానం ఎక్కి బయలుదేరారు. మధ్యలో భరద్వాజ ఆశ్రమంలో దిగుతారు. భరద్వాజుడు ఎంతో ఆనందించి, సంతోషించి అతని వద్దనున్న అస్త్రములు యిస్తాడు. 'పట్టాభిషేకం సత్వరమే జరుగుగాక' అని ఆశీర్వదించుతాడు. తరువాత అగస్త్యాశ్రమములో దిగుతారు. అక్కడ కొంచెం ఆలస్యమౌతుంది. హనుమంతుని ముందు పంపిస్తాడు రాముడు. 'నా విమానం ఆలస్యమౌతుందేమో! హనుమంతా! నీవు ముందు పోయి, రాముడు వస్తున్నాడని చెప్పు' అంటాడు. అప్పటికి సరిగా పదునాలుగు సంవత్సరాలు పూర్తి అయింది. పదునాలుగు సంవత్సరముల తరువాత రాముడు రాకపోతే ఒక్క క్షణమైనా బ్రతకనని ఆదిలోనే చెప్పాడు భరతుడు. చితి పేర్చుకున్నాడు. అగ్నిలో దుముకటానికి సిద్ధంగా ఉన్నాడు భరతుడు. అదే సమయానికి వాయువేగంతో హనుమంతుడు అక్కడకు చేరుతాడు. రాముని రాకను తెల్పి భరతుని శాంతింపచేస్తాడు. భరతుడు భక్తి ప్రపత్తుడు. లక్ష్మణుడు సేవకనాయకుడు. లక్ష్మణుడు సాకారరూపాన్ని ఆరాధించే వాడు. నిరంతరమూ, రాత్రింబవలు కన్ను మూయకుండా రామసీతలను కాపాడుకుంటూ వచ్చాడు. పదునాలుగు సంవత్సరములు నిద్ర ఎరుగడు, అలాంటి మహాత్యాగి లక్ష్మణుడు, సాకారస్వరూపుడు. ఇక నిరాకార స్వరూపుడు భరతుడు. ఆ భరతుణ్ణి అయోధ్యావాసులు ఎవరూ ఈ పదునాలుగు సంవత్సరములు చూడలేదు. నంది గ్రామంలో చిన్న కుటీరం వేసుకొని, అందులోనే రాం..రాం.. అంటూ రామచింతన చేసుకుంటూ కూర్చున్నాడు. భరతుని మనసంతా రామునిపైన పెట్టాడు. లక్ష్మణడు దేహమంతా రామునికి అందించాడు. లక్ష్మణుడు, 'నీ దాసుడను! సర్వవిధములా నన్ను ఉపయోగపెట్టుకో. నాకు ఇంతకంటె మరొక ప్రాణం లేదు. నేను నీకు ఆరవ ప్రాణం' అన్నాడు. భరతుడు అట్లా కాదు. 'నా దేహమే లేదు. నేనంతా నీలోనే ఉన్నాను' అని రామచింతన చేస్తూ రావటం వలన రాముని వలె భరతుడు కూడా నీలమేఘశ్యాముడై పోయినాడు. రథమును తీసుకొని సరయూ తీరమునకు వెళ్ళాడు భరతుడు. అక్కడ విమానం దిగిన శ్రీరాముని రథం మీద కూర్చోపెట్టుకొన్నాడు. భరతుడే రథమును స్వయముగా నడుపుకొని తీసుకొని వస్తున్నాడు. అయోధ్యావాసులు చూస్తున్నారు. వారికి ఆశ్చర్యం వేసింది. ఎవరు రాముడు, ఎవరు భరతుడు, వారు గుర్తించలేకపోయారు. అన్ని విధాలా రామునివలె తయారైనాడు భరతుడు.

### రామపట్టాభిషేకం

అదే రోజున రామునికి పట్టాభిషేకం చేయాలని వసిష్ఠాది మహర్షులు నిర్ణయించారు. అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక్కడ చిన్న విచిత్రం. వానరులంతా నరులుగా మారిపోయారు. అందరూ ఏనుగులపైన, ఒంటెలపైన, గుఱ్ఱాలపైన ఊరేగింపుగా వస్తున్నారు. వివేకం గలవాడే నరుడు, స్థిరచిత్తుడే నరుడు. పట్టాభిషేకం జరిగింది. పట్టాభిషేక సమయంలో అనేకమంది అనేక విధములైన బహుమతులు యిస్తూ వచ్చారు. నూరుకోట్ల బంగారు కాసులు బ్రాహ్మణులకు పంచాడు రాముడు. కొన్ని లక్షల గోవులను దానంచేశాడు. సామంత రాజులంతా ఒకవైపున, మంత్రులంతా మరొకవైపున, ఋషులంతా యింకొకవైపున కూర్చున్నారు. రాముడు మొట్టమొదట ఋషులు కూర్చున్నవైపుకు వచ్చి తల వంచాడు. అనగా విధేయతను ప్రకటించాడన్నమాట. రాజులను చూచి నవ్వాడు. ప్రజలను చూసాడు, ఆశీర్వదించాడు. స్త్రీలను చూచి తల సగం మాత్రమే వంచాడు. ఈవిధంగా ఎవరికి ఎంత గౌరవం యివ్వాలో అంత యిస్తూ వచ్చాడు. రామునికి ఎవరు ఎంత దూరంలో ఉండినప్పటికీ హనుమంతుడు మాత్రం దగ్గరలో ఉండేవాడు. అందరికన్నా సన్నిహితుడైనాడు. సహోదరులైన లక్ష్మణ, భరత, శతృఘ్నులైనా కొంత దూరంగా వున్నారుగాని, సీత దూరంగా

ఉన్నదిగాని హనుమంతుడు మాత్రం దూరం కాలేదు. కారణం? నిరంతరమూ రామచింతనే, ఆ రామ సేవయే. తన దేహమూ, రామ దేహము ప్రత్యేకమైనది కాదు. అప్పుడు రాముడు లేచి, 'ఓ హనుమంతా! నీకు నేనేమి బహుమతి యివ్వగలను! నన్ను నేను యిచ్చుకుంటున్నాను' అని కౌగలించుకున్నాడు. ఈ సన్నివేశంతో హనుమంతుడు మైమరచిపోయాడు. అదియే నిర్వికల్పసమాధి.

వేదవేద్యుడైన భగవంతుడు దశరథాత్మజుడై పుట్టినప్పుడు ప్రాచేతసుడు అతని చరిత్రను వ్రాసి పవిత్రుడైనాడు. కరుణారస పూరితుడైన రఘునాథ చరితమే రామచరితము. మానవుని అభ్యుదయమునకు ఈ చరిత్రయే చక్కని రాజమార్గము. మానవత్వమందు దివ్యత్వము, దివ్యత్వమునందు మానవత్వము సమ్మిళితమైన స్వరూపమే రామతత్త్వము. 'సర్వలోక హితే రతః' అతడు సర్వ లోకముల హితమును ఆశించి, హితమును బోధించి, హితమును అందుకున్నాడు. 'సర్వజ్ఞానోప సంపన్నః' సమస్త జ్ఞానములను హస్తగతం గావించు కున్నవాడు. 'సర్వే సముదితా గుణాః' సమస్త సద్గుణములను కలిగియున్నవాడు. సమైక్యతా గుణాన్ని నిరూపించిన వాడు. కనుకనే, అతడు దేవుడుగా మారిపోయాడు.

రాముని ధర్మదీక్షలో ప్రధానమైనది సత్యవ్రతం. ఎంత కఠిన పరీక్ష ఎదురైనా, ఎంత కష్టం వచ్చినా రాముడు సత్యమును విడనాడలేదు. సత్యమే ధర్మం, ధర్మమే సత్యం. రెండింటికీ అవినాభావసంబంధం. 'సత్యం వద, ధర్మం చర' అని ఉపనిషద్వాక్యం. పర్వతశిఖరాలు తలలు వంచనంత కాలమూ, సముద్రాలు ఘోషిస్తున్నంత కాలమూ రాముని స్మృతి భద్రంగా వుంటుంది. సత్యమునూ, ధర్మమునూ విడనాడకుండా ఆయన పాటించటమే దీనికి కారణం. అమృతత్వమును చేరుకొనే మార్గమును చూపుటకే అమృతమూర్తి రామావతారం ధరించి వచ్చాడు.

ఒక పల్లెటూరి మనిషి కొంత సామాను తీసుకొని స్టేషనుకు వచ్చి, టిక్కట్టు కొని రైలు ఎక్కి సామాను పెట్టుకొని కూర్చున్నాడు. ఎంతోమంది ప్రయాణీకులు పెద్ద పెద్ద సామాన్లతో రైలు ఎక్కుతున్నారు. పాపం! ఈ అమాయకుడు అజ్ఞాని, అహంకారి మాత్రం కాదు. ఆ వ్యక్తి అనుకుంటున్నాడు, 'ఇంతమంది సామాను రైలు మోస్తున్నది. కొంత బరువు తగ్గిద్దామ'నుకొని తన సామాను తన తలపైన పెట్టుకున్నాడట. తనను, తన సామాను మోసేది రైలే! సామాను ప్రక్కన పెట్టు, హాయిగా కూర్చో. అదేవిధముగా భగవంతునికి అన్నీ అర్పితము చేయి. నీవు నిమిత్తమాత్రంగా కూర్చో. అన్నీ తానే చూసుకుంటాడు. ఇలాంటి పవిత్రమైన విశ్వాసం రావాలి. ఆ విశ్వాసమే లేకపోతే, ఏ చిన్న దానినీ సాధించలేరు. ప్రతి దానికి విశ్వాసమే మూలము. ఆ నమ్మకమే సరియైనటువంటి ఆదర్శమును అందిస్తుంది. కనుక, సత్య ధర్మముల పైన మనం విశ్వాసాన్ని పెంచుకోవాలి. దైవ ఆజ్ఞలపైన మనం సరియైన విశ్వాసాన్ని పెంచుకోవాలి. ఒక నిముషం అటు, ఒక నిముషం యిటు గడియారం పెండ్యులం వలె ఊగిసలాడకూడదు. నిలకడ ఉండాలి. ఒక మాట మాట్లాడాలి. రెండు మాటలు మాట్లాడకూడదు. ఒకే మాట, ఒకే పత్ని, ఒకే బాణం. అదియే శ్రీరాముని యొక్క ప్రత్యేకత. కనుక, రామతత్త్వాన్ని మనం ఈవిధంగా ఆరాధించాలి.